నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
సోమవారం 08, ఏప్రిల్ 2024 పేజీలు - 8

# బ్రాహ్మణపల్లిలో ఉచిత వైద్య శిబిరం



బీబీనగర్, మేజర్‌న్యూస్ : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో పారిజాత మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ భువనగిరి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ పారిజాత గ్రామంలోని ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సురకంటి హరిప్రసాద్ రెడ్డి,బండి మధు, తూపెల్లి ప్రశాంత్ రెడ్డి,సారా భానుకుమార్, చాట్ల నవీన్,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు నిలయంగా గోపిరెడ్డోని బావి మూలమలుపు

- ఎండిన బావిని పూర్చుటలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు
- భయభ్రాంతులకు గురవుతున్న వాహన చోదకులు
- ఇంకా ఎంతమందిని బలిగొంటుదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్న వాహానచోదకులు...?
- బావి చుట్టూ తూతూ మంత్రంగా బెస్ మెంట్ నిర్మాణం చేసి చేతులు దులుపుకున్న కాంట్రాక్టర్
- ఎండిపోయిన బావిని పూడ్చివేసి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్న స్థానికులు





మునుగోడు, మేజర్‌న్యూస్ : మునుగోడు నుండి నార్కట్‌పల్లి వెళ్లే రహదారి వడ్డెరగూడెం దాటగానే వచ్చే మూలమలుపు ప్రమాదాలకు నిలయంగా మారిందని వాహన చోదకుల నుండి విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికి ఎన్నో ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఎండిపోయిన బావని పూడ్చివేయటలో ఎందుకు నిర్లక్ష్యం వేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నార్కట్‌పల్లి నుండి మునుగోడుకు డబల్ రోడ్డు నిర్మాణం జరిగేటప్పుడు కొంత మంది స్థానికులు, ప్రజా ప్రతినిధులు బావిని పూడ్చి వేయాలని కోరిన కాంట్రాక్టర్ పట్టించుకోకుండా తనకు ఇష్టం వచ్చినట్లు వేశారని స్థానికులు అనుకుంటున్నారు.

మిగతా 2లో

# ప్రజలకు మంచినీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలి

## జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి






**నల్గొండ జిల్లా బ్యూరో**

ఆదివారం నల్లగొండ జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో జెడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశంలో వేసవిలో ప్రజలకు తాగు నీటి సరఫరా, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ధాన్యం సేకరణ తదితర అంశాలపై చర్చించారు. ఈ వేసవిలో జిల్లా ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగు నీరు సరఫరా చేయాలని జిల్లా పరిషత్తు సభ్యులు కోరారు. ఇందుకు సంబంధిత శాఖల అధికారులు స్పందిస్తూ తాగునీటి విషయంలో ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సివిల్ సప్లై సమీక్షలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 370 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి నిర్ణయించామని, ప్రస్తుతం 250కి పైగా సెంటర్లు ప్రారంభించామని, ఈ యాసంగిలో 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నామని సభ్యులకు తెలిపారు. వైద్యంపై సమీక్ష సందర్భంగా నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకునే జాగ్రత్తలకు సంబంధించి జిల్లా వైద్యాధికారి కొండలరావు సభ్యులకు తెలియజేశారు. ఈ సందర్భంగా వడదెబ్బ తగలకుండా ఉండడానికి ఏం చేయాలి ఏం చేయకూడదనే అంశాలకు సంబంధించి జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, జడ్పిటిసిలు, ఎంపీపీలతో కలిసి గోడపత్రికను విడుదలచేశారు. ఈ సమావేశంలో డిఆర్డీ, విద్యాశాఖ, సంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యలపై చర్చించారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి సంబంధిత శాఖల అధికారులతో పాటు, జెడ్పిటిసిలు, ఇతర సభ్యులు హాజరయ్యారు.

## పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో

## తప్పుడు ప్రచారాలతో కూడిన అభ్యర్థుల వ్యక్తి గత ప్రచార

# పోస్టర్లను విడుదల చేయరాదు



## జిల్లా ఎస్పీ చందనా దీప్తి

నల్గొండ జిల్లా బ్యూరోః పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల వ్యక్తిగత త ప్పుడు ప్రచారాలతో పోస్టర్లను విడుదల చేయరాదని జిల్లా ఎస్పీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభ్యర్థులు తమ ఎన్నికల కరపత్రం లేదా పోస్టర్‌లు అభ్యర్థుల ముఖం పేర్లు, ప్రింటర్, పబ్లిషర్ చిరునామాలు లేనివి ముద్రించడం లేదా ప్రచురించటం వంటివి చేయకూడదని అన్నారు.

# ఎమ్మెల్యే కుంభం సమక్షంలో కాంగ్రెస్‌లో భారీ చేరికలు



బీబీనగర్,మేజర్,న్యూస్ః బీబీనగర్ మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,మాజీ ఉప సర్పంచ్,వార్డు సభ్యులు ముస్లిం మైనార్టీ సంఘాలతో పాటు వివిధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున స్త్రీశిశు సంక్షేమ స్థాయి జిల్లా చైర్మన్,స్థానిక జెడ్పిటీసీ గోళి ప్రణీతపింగల్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువ కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలకు ప్రజలు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం కష్టపడే కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏ ఒక్క కార్యకర్త సంతోషంగా లేరని అన్నారు. ముందుముందు సమిష్టి కృషితో పార్టీ బలోపేతం చేయాలని అన్నారు. భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకొని బీఆర్ఎస్ పార్టీకి తగిని గుణపాఠం చెప్పాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే

సూర్య



# కోదాడ పశువుల సంత ఆదాయం స్వాహా

## రశీదులు లేకుండానే వసూళ్లు

## సిబ్బంది ఇష్టారాజ్యం





కోదాడ, మేజర్ న్యూస్ : రాష్ట్రంలోనే అతి పెద్ద పశువుల సంతగా కోదాడ సంతకు పేరున్నది. గతంలో కోట్ల రూపాయల ఆదాయం ఉండేది. కాలక్రమంలో జరిగిన మార్పులతో పాటు ప్రస్తుతం ఉన్న అధికారులు, సిబ్బంది వైఖరి కారణంగా ప్రభుత్వ ఆదాయానికి తీవ్రంగా గండిపడుతోంది. సంతలో జరిగిన ప్రతి లావాదేవీకి రైతుల వద్ద నుంచి నిర్ణీత ఫీజు వసూలు చేయడంతో పాటు వారికి రశీదులు అందజేయాల్సి ఉన్నది. ప్రతి ఆదివారం ఇక్కడ సంత జరుగుతోంది. ప్రతి లావాదేవీకి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు రైతులు, వ్యాపారుల వద్ద తీసుకొని రశీదులు అందజేయాల్సి ఉంటుంది. వీటికి సంబంధించిన రికార్డులు కూడా నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకు విరుద్ధంగా రశీదులు ఇవ్వకుండా వసూళ్లు చేసి తమ జేబుల్లోకి మళ్లించుకుంటున్నట్లు తెలుస్తుంది. దీని వలన ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. పాలకవర్గం లేకపోవడంతో అధికారులు, సిబ్బంది తమ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పశువుల, మేకలు, గొర్రెల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో దొంగతనం చేసిన జంతువులను ఇక్కడ అమ్మి సొమ్ము చేసుకునే అవకాశముంది. ప్రతి లావాదేవీకి రికార్డులు, రశీదులు ఉంటేనే భవిష్యత్తులో ఏదైనా సంఘటన జరిగినప్పుడు గుర్తించే అవకాశం ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా సరిచేయాలని కోరుతున్నారు.

# ప్రమాదాలకు నిలయంగా గోపిరెడ్డోని బావి మూలమలుపు

(మొదటిపేజీ తరువాయి)

తూతూ మంత్రంగా భావి చుట్టూ రెండు ఫీట్ల వరకు బేస్ మెంట్ నిర్మాణం చేపట్టి చేతులు దులుపుకున్నారని ఆరోపిస్తున్నారు.గతంలో మండలంలోని సింగారం గ్రామానికి చెందిన ప్రభుత్వ రెవెన్యూ ఉద్యోగి విధులను ముగించుకొని ఇంటికి వస్తుండగా బావిలో పడి కాళ్ళు విరిగిన సంఘటన మండల వ్యాప్తంగా తెలిసిన విషయమే అయిన గాని అట్టి బావిని పూడ్చి వేయుటలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని వాహన చోదకులు, బాట సారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.శుక్రవారం అర్ధరాత్రి జరిగిన సంఘటనతో మూల మలుపు వద్దకు రాగానే వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతూనట్లు తెలుస్తుంది. శుక్రవారం అర్ధరాత్రి పూట కొంతమంది యువకులు శుభకార్యాలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో బావిలో పడ్డారని వారిని చాలా సహాయంతో బయటకి తీశారని మండల వ్యాప్తంగా జోరుగా చర్చ జరిగుతూ ఎవరు కావచ్చు, ఏ గ్రామం వారు కావచ్చు పాపం అని ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ ఈ సంఘనట జరిగి రెండు రోజులు అయిన రోడ్ వెంబడి వచ్చిపోయే వాహన చోదకులు వారు ప్రయాణిస్తున్న వాహనాలను అపి చూడడం ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఎండిపోయిన బావిలోనే స్విఫ్ట్ కార్ ఉండటం గమనార్హం. ప్రమాదం జరిగి రెండు రోజులు అయిన ఎంత మందికి గాయాలయ్యాయి లేక ఎవరైనా మృతవాత పడ్డారా అనే ప్రశ్న వాహన చోదకులు తోలుస్తుంది. ఎండీపోయిన బావిలోనే కారు ఉండటం చూస్తుంటే ఇలాంటి కార్లు ఎన్ని మరెన్నో పడితే గానీ బావిని పూడ్చి వేస్తారెమోనని బాటసారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగినా ఇప్పటికీ చూసి చూడనట్టుగానే అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. నార్కట్ పల్లి నుండి మునుగోడుకు వచ్చే రహదారిలో వడ్డెర గూడెం కు కూతవేటు దూరంలో ఉన్న మూలమలుపుతో వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నట్లు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఎండిపోయిన బావిని పూడ్చి వేసి ప్రాణాలను కాపాడాలని, ప్రమాదాలను నివారించి అరికట్టాలని కోరుతున్నారు.

# ఎమ్మెల్యే కుంభం సమక్షంలో కాంగ్రెస్‌లో భారీ చేరికలు

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు.బీబీనగర్ పట్టణంలో బీఆర్ఎస్ పూర్తిగా ఖాళీ అయిందని తెలిపారు.అనంతరం స్థానిక జెడ్పిటీసీ గోళి ప్రణీతపింగల్ రెడ్డి ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పి చైర్మన్ కసిరెడ్డి నారాయణ రెడ్డి,ఎంపీటీసీలు గోళి నరేందర్ రెడ్డి,టంటం భార్గవ్,మండల కోఆప్షన్ సభ్యులు ఎండి అక్బర్,పీఎసీఎస్ వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్,జిల్లా నాయకులు పొట్టోళ్ల శ్యామ్ గౌడ్,సందిగారి బస్వయ్య,పంజాల పెంటయ్య గౌడ్,పంజాల వెంకటేష్ గౌడ్,బెండె ప్రవీన్,సామల వేణు,టంటం రఘు,ఎండి మోయిన్,నర్సింహ రెడ్డి,పిట్టల శ్రీనివాస్,లోకదాసు ఉప్పలయ్య,కట్ట ప్రభాకర్,ఎండి మస్తాన్,అజగర్ అలీ,తదితరులు పాల్గొన్నారు.

# గడ్డు పరిస్థితి

తిప్పర్తి, మేజర్‌న్యూస్ ః దేశ ఆర్థిక వ్యవస్థ మరింత గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటున్నది. కార్పొరేట్లకు ఉద్దీపన వంటి ప్యాకేజీలు ప్రకటించినా ఇప్పట్లో ఎగబాకే సూచనలు కనిపించడం లేదు. రెండురోజులకత్రం వెల్లడైన అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) నివేదికలో భారత్ ఆర్థిక వ్యవస్థ తాము ఊహించిన దానికంటే ఎక్కువగా మందగించిందని తేల్చింది. తాజాగా భారతీయ రిజర్వు బ్యాంక్(ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంతదాస్ కూడా ఆర్థిక సంక్షోభం ఇంతగా దిగజారుతుందని తాను అనుకోలేదని అన్నారు. అంటే సంక్షోభ తీవ్రత ఎంత ఆందోళనగా ఉందన్నది తెలుస్తోంది. ఇక ఈ పరిస్థితిని చక్కదిద్దడం తనవల్ల కాదన్న అభిప్రాయానికి దాస్ వచ్చేశారు. వాస్తవానికి వృాఎద్ధిరేటు ఐదు శాతానికి పడిపోవడం ఆశ్చర్యంగా ఉందని శక్తికాంతదాస్ నోటివెంట అలాంటి మాటలు రావడాన్ని బీజేపీ పెద్దలు ఊహించి ఉండరు. ఎందుకంటే ఏరికోరి శక్తికాంతదాస్‌ను ఆర్‌బీఐ గవర్నర్‌గా ప్రధాని మోడీ తెచ్చిపెట్టుకున్నారు. ఇప్పుడు ఆయన కూడా చేతులెత్తేయడం గమనార్హం. సంక్షోభాన్ని గట్టెక్కిస్తారని ఆశించిన బీజేపీ నేతలకు ఆర్‌బీఐ గవర్నర్ వ్యాఖ్యలు రుచించకపోయి ఉండొచ్చు. ఎంతోకొంత పడిపోతుందని అంచనా వేశాం తప్ప ఇంత తక్కువగా ఉంటుందని అనుకోలేదని వృాఎద్ధిరేటును చూసి ఆయన ఆశ్చర్యపోవడంలో వింతేమీ లేదు. కేంద్రంలోని కార్పొరేట్ వింగ్‌లో ఆర్థిక సెక్రటరీగా గుర్తింపు తెచ్చుకున్న శక్తికాంతదాస్‌కు ఆర్థిక పరిస్థితి గురించి ముందుగానే అంచనా లేదనుకోవడం అమాయకత్వమే అవుతుంది. ఆయన మోడీకి నమ్మినబంటు. ప్రస్తుత పరిస్థితుల్లో మందగమనాన్ని అంచనా వేసి చెప్పడం కష్టమేనని చెప్పిన గవర్నర్.. రెండో త్రైమాసికంలో వృాఎద్ధి మరింత కుంగిపోయే అవకాశం ఉందని చెప్పకనే చెప్పారు. అయితే, ఉద్దీపన చర్యలతో దేశ ఆర్థిక వ్యవస్థ తిరిగి వేగంగా పుంజుకుంటుందన్న ఆశ ఆయనకు ఏ కోశానా లేదు. పొమ్మనలేక పొగపెట్టినట్టుగా రఘురామ్‌రాజన్‌ను, ఉర్జిత్‌పటేల్‌ను తప్పుకునేలా చేసిన మోడీ సర్కార్ శక్తికాంతదాస్‌ను అలా సాగనంపుతారని అనుకోలేం.

కార్పొరేట్ అనుకూల నిర్ణయాలే ప్రస్తుత ఈ పరిస్థితికి కారణం. నోట్లరద్దు, జీఎస్టీలు ఆర్థికరంగాన్ని మరింత ఆందోళనలోకి నెట్టేసాయి. ఈ విధానాలు చిన్న వ్యాపారులు, అసంఘటిత రంగాలను కుప్పకూల్చాయి.. కనీస వేతన చట్టం అమలుగాక పోవడం, ఉపాధి తగ్గడం, ఉద్యోగాలు పోవడం జరుగుతున్నాయి. కార్పొరేట్లకు, పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్ల రుణాలివ్వడం వల్ల బ్యాంకులు దివాళా తీశాయి. ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, ఎయిర్ ఇండియాలను అమ్మకానికి పెట్టింది. అందులో భాగంగానే భారత్ పెట్రోలియం సంస్థను అమ్మేయడానికి రేటు కూడా ఖరారు చేసింది. ఆఖరుకు రక్షణ సంస్థలనూ ప్రయివేటీకరించేందుకు సిద్ధమైంది. బొగ్గులోనూ విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం పలికింది. ప్రస్తుత సంక్షోభానికీ, ప్రజల మధ్య అసమానతలు పెరగడానికీ ప్రధాన కారణం ప్రభుత్వరంగాన్ని విస్మరించి ప్రయివేటు పెట్టుబడులకు అనుమతించడమేనన్నది అనుభవం చెవుతున్న సత్యం.

వృాఎద్ధి రేటు ఐదుశాతంగా పడిపోయిందని కేంద్రప్రభుత్వం గతనెలలోనే ప్రకటించింది. అయితే, మందగమన పరిస్థితులు పోయి ఆర్థిక వ్యవస్థ ఎప్పుడు కోలుకుంటుందన్న దానికి శక్తికాంతదాస్ వద్ద స్పష్టమైన సమాధానం లేదు. సర్కారు సరైన చర్యలు తీసుకుంటే పరిస్థితులు చక్కబడొచ్చంటున్న ఆర్‌బీఐ గవర్నర్ ఇప్పుడు తీసుకుంటున్న నిర్ణయాలు మంచివేనని చెప్పేందుకు వెనుకాడుతున్నారు. రిజర్వు బ్యాంకు నుంచి అందుకున్న లక్షన్నరకోట్లకు పైగా సొమ్ములో బ్యాంకులకు రూ. 70వేలకోట్లను కేంద్రం కేటాయించింది. నిరర్థక ఆస్తుల ఊబిలోకి జారిపోయిన బ్యాంకులను బయటకు లాగే పేరిట విడతలవారీగా వేలకోట్లు కుమ్మరిస్తున్నది. బ్యాంకుల వద్ద డబ్బు లేకపోవడానికి కారణం పారిశ్రామికవేత్తల్లో కొందరు తీసుకున్న డబ్బును చెల్లించకుండా ఎగ్గొట్టడమే. బ్యాంకులను మోసగించిన వారిపై ఎలాంటి చర్యలూ లేవు. వారి నుంచి వసూళ్లు చేస్తున్నదీ లేదు. మందగమనానికి ప్రజల్లో కొనుగోలుశక్తి లేకపోవడమే ప్రధాన కారణం. విదేశీపెట్టుబడుల కోసం ద్వారాలు తెరవడం, పారిశ్రామికవేత్తలకు ఉద్దీపనలు, రాయితీలు, వడ్డీరేట్లు తగ్గించడం వంటి నిర్ణయాలు తీసుకున్నా ఇవేమీ దిగజారుతున్న ఆర్థిక వ్యవస్థను ఆదుకోలేవన్నది ఆర్థికనిపుణుల విశ్లేషణ.

యాజమాన్యాలను ఆదుకునేందుకు కేంద్రం పెద్దలు హడావుడి పడ్డారే గాని, ఉద్యోగాలు కోల్పోయిన వారికి, నిరుద్యోగులకు సహాయంగా చిటికెన వేలు కదల్చలేదు. ఈ ఉద్దీపన కుబేరులకు తప్ప సామాన్యులకు ఒరగబెట్టిందేమీ లేదు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం వ్యవహరించిన విధానాల వల్లనే అసమానతలు పెరిగాయన్నది వాస్తవం. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు, ప్రభుత్వ పెట్టుబడులను ప్రోత్సహించడమే పరిష్కారమార్గమని అమర్త్యసేన్, ప్రభాత్‌పట్నాయక్ లాంటి ఆర్థిక వేత్తలతో పాటు వామపక్షాలూ చెబుతున్నాయి. పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న మోడీ ప్రభుత్వం మేధావుల విజ్ఞప్తులను చెవికెక్కించుకుంటున్నదెక్కడీ.

# మహా మంచిమాట

కులం అడ్డుగోడలు – మతం నిలువు గోడలు మనిషి జీవితాన్ని ఛిద్రం చేస్తున్న సమాజం మనది. తమ కులానికి చెందని వారిని, తమ మతం కానివారిని ప్రేమించినందుకు, పెండ్లాడినందుకు సొంత బిడ్డల్ని సైతం నిర్ధాక్షిణ్యంగా నరికి చంపుతున్న దుస్థితి. ఈ నేపథ్యంలో బుధవారంనాడు సర్వోన్నత న్యాయస్థానం కుల, మతాంతర వివాహాలపై వెలువరించిన అభిప్రాయం అక్షరాలా అనుసరణీయం. ”కులాంతర, మతాంతర వివాహాలకు వ్యతిరేకం కాదు. అలాంటి వివాహాలవల్ల ’సమాజవాదం’ బలపడుతుంది. హిందూ–ముస్లిమ్ వివాహాలు కూడా ఆమోదయోగ్యమే. చట్టప్రకారం ఒకరినొకరు పెండ్లాడితే సమస్య ఏముంటుంది. కులాల అంతరాలు కూడా తొలగిపోతే మంచిదే. ఉన్నత కులాలు, నిమ్న కులాలుగా చెప్పుకుంటున్నవాళ్లు పెండ్లిండ్లు చేసుకుంటే మరింత మేలు” అని జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎం.ఆర్.షాలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన హిందూ యువతిని ముస్లిం యువకుడు హిందూ మతంలోకి మారి పెండ్లి చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఆమె తండ్రి హైకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు ఆ ఇద్దరూ కలిసి జీవించవచ్చునని తీర్పునిచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ అమ్మాయి తండ్రి సుప్రీం కోర్టును ఆశ్రయించగా ఈ కేసును విచారించేందుకు ధర్మాసనం అంగీకరించలేదు. ఈ కేసు విచారణ జరపబోమని స్పష్టం చేస్తూ ”ఆమె ప్రయోజనాలు కాపాడాలని తాము కోరుకుంటున్నామని, ఆ యువతిని బాగా చూసుకోవాలని, నమ్మకమైన భర్తగానేకాక గొప్ప ప్రేమికునిగా మసలుకోవాలని” కోర్టు అతనికి సూచించింది.

భారత రాజ్యాంగం, చట్టం ఏనాడూ కుల, మత వివక్షలను అంగీకరించలేదు. వ్యక్తులు ఏ మతం నుంచి ఏ మతంలోకైనా మారే స్వేచ్ఛను, అలాగే ఏ మతం, కులంవారినైనా వివాహమాడే అవకాశాన్ని కల్పించింది. ఇందుకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకునేవారిని శిక్షించేందుకు కఠిన చట్టాలు కూడా తయారు చేసింది. అయితే చట్టం కన్నా విశ్వాసం ముఖ్యమని భావించేవాళ్లు, రాజ్యాంగం కన్నా మనుధర్మం ఉత్తమమని నమ్మేవాళ్లూ మాత్రం చట్టాలను చట్టుబండలు చేసి మానవత్వాన్ని మంటగలువుతున్నారు. మత విశ్వాసం, కులహౌదా చుట్టూ అల్లబడిన మాయ (మిత్)కు లోనై, ’స్థాయి’ (స్టేటస్)కు బందీలై తమ కులం కలుషితం కాకుండా, మతం మలినం కాకుండా కాపాడుకోవాలన్న ’అహం’తో ఆలోచనలు కమ్మేయగా తమవేలితో తమ కండ్లనే పొడుచుకుంటున్నారు.

మానవత్వం ఉన్న తల్లిదండ్రులు, తోబుట్టువులు ఎవరైనా తాము అల్లారుముద్దుగా కనిపెంచుకున్న తమ రక్తం పంచుకు పుట్టిన వాళ్ళు పచ్చగా పది కాలాల పాటు బతకాలనుకుంటారు. అందుకు ఎంతో శ్రమిస్తారు. అయితే వివాహం విషయంలోకి వచ్చేసరికి తమ ఆచారాలను పాటించని తమ పిల్లల ఎడల హంతకులుగా మారిపోతారు. తమ పిల్లలను వివాహమాడే వ్యక్తులకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ, వారి దాంపత్య జీవితం సాఫీగా, సుఖవంతంగా సాగిపోతుందన్న నమ్మకమున్నప్పటికీ కేవలం కులం, మతం కారణంగా వారి వివాహాన్ని అడ్డుకుంటారు, వారిని అంతమొందించే దుస్థితికైనా దిగజారుతారు. దిగజారుతున్నారు కూడా. మన దగ్గర ప్రణరు ఉదంతం నుంచి, కేరళకు చెందిన హరియా ఇప్పుడు ఈ యువతి వరకూ ఇలాంటి ఉదంతాలు మన దేశంలో వేలూ లక్షలు.

నిజానికిది ఒక భయంకరమైన మానసిక సమస్య. అంతకుమించి భావజాల సమస్య. అవును! వ్యక్తులను తమతమ కులాల, మతాల పరిధిలో బంధించేందుకు సృాఎష్టించిన భావజాలాలు అనివార్యంగా ఆయా కుల, మతస్తుల బుర్రకెక్కి వారిని బుద్ధిహీనులుగా మార్చుతున్నాయి.

రక్త సంబంధీకులు అన్య కుల, మతస్తులను ప్రేమించి, పెండ్లాడే సమయంలో వారి కుటుంబ సభ్యులు ఇంత కిరాతకంగా ప్రవర్తించేందుకు వారి చుట్టూ ఉన్న సాటి కులస్తులు, మతస్తులు కూడా ఒక ప్రధాన కారణం. ఇంకా భూస్వామ్య భావజాలం అధికంగా ఉన్న మన దేశంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో గ్రామంపై తమ పట్టు నిలువుకునేందుకు కులపెద్దలు ఇలాంటి విషయాలలో ఆయా కుటుంబీకులపై నిర్థాక్షిణ్యంగా, దారుణంగా ప్రవర్తిస్తారు. హర్యానా ఖాఫ్ పంచాయతీలంత భయంకరంగా భౌతిక దాడులకు పాల్పడనప్పటికీ, మానసికంగా, సామాజికంగా వారిని ఒంటరి చేసి, వెలివేస్తారు. కుల, మతాతీత వివాహాలు జరిగిన కుటుంబాలకు చెందిన యువతీ యువకులకు వివాహాలు కాకుండా వేధిస్తారు. సాటి సమాజం నుంచి ఎదురయ్యే ఈ దారుణ మానసిక, శారీరక, సామాజిక దాడిని తట్టుకోలేక తమ పిల్లలు చేసిన ’పాపానికి’ ప్రక్షాళనగా పాము తన పిల్లలను తానే చంపుకుతిన్నట్టు ప్రవర్తిస్తారు. ఈ నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం పలికిన హిత వచనాలు, చేసిన సూచనలు సాటి మనుషుల పుట్టుక కారణంగా వారిపై వివక్ష ప్రదర్శించే చెంపపెట్టులాంటివి. మూర్ఖపు కులతత్వం నిండిన తల్లిదండ్రులకు, రక్త సంబంధీకులకు కనువిప్పులాంటివి. సర్వోన్నత న్యాయస్థానం హితవచనాలను నిండుమనస్సుతో స్వీకరిద్దాం. మనమూ పాటిద్దాం. వివక్ష కానరాని ఉన్నత సమాజంవైపు అడుగులేద్దాం.

# ఒకే భాష ఎవరి కోసం..?

అంటూ వైవిధ్య భరితమైన భారతదేశ భౌగోళిక, భాషా, సాంస్కృాఎతిక ముఖచిత్రాన్ని హృాఎద్యంగా ఆవిష్కరిస్తాడు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్.. ఇది కోట్లాది మంది భారతీయులు గొంతుల్లో ప్రతిధ్వనించే మన జాతీయగీతం. మన జాతీయ భావనకు, నిజమైన భారతీయతకు ఓ ప్రతీక.

# కలకోవలో కలకలం రేపుతున్న ద్విచక్ర వాహనం దగ్ధం



మునగాల, మేజర్‌న్యూస్ : మండలంలోని కలకోవ లో రోడ్డు ప్రక్కన ఉన్న ద్వి చక్ర వాహనం కాలి బూడిదయింది. ఈ వాహనాన్ని ఎవరైనా ఉద్ధేశ్య పూర్వకంగా కాల్చి వేసారా లేక ప్రమాద వశాత్తు కాలిందా అన్న విషయం తెలియడం లేదు. బైకు తగుల బడుతున్న సమచారం స్థానికులు సామాజిక మాధ్యమాల్లొ ప్రచారం చేస్తున్నారు.

# తొగర్రాయిలో వడదెబ్బతో మహిళ మృతి



కోదాడ రూరల్, మేజర్ న్యూస్ : తొగర్రాయి గ్రామానికి చెందిన కన్నెబోయిన కోటమ్మ (50) వడదెబ్బకు గురై మృతి చెందినట్లు మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వరప్రసాద్ రెడ్డి, అమరనాయిని వెంకటేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి భాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కాసాని పుల్లయ్య, బాలెబోయిన ఏడుకొండలు, వేలాద్రి, కన్నెబోయిన వెంకన్న, రామారావు, కిషోర్, కొండలు, అంజయ్య పాల్గొన్నారు.

# బెల్ట్ షాపుల పై దాడులు కేసు నమోదు



మునుగోడు, మేజర్‌న్యూస్ : మండలంలోని ఊకొండి గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై ఆదివారం స్థానిక ఎస్ఐ చందా వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడులలో కొంతమంది అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.ఇంకా గ్రామాలలో ఎవరైనా అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే స్థానికులు సమాచారం ఇవ్వాలని సూచించారు.
ఫోటోః 7 చిలుకూర్ 01

# టాటా ఏసీ, లారీ ఢీ ఒకరు మృతి

చిలుకూర్ మేజర్ న్యూస్ః మండల కేంద్రంలోని ఎన్‌హెచ్-67 రహదారిపై కవిత కాలేజీ దగ్గర ఆదివారం కోదాడ నుండి వెళ్తున్న ఏపీ 07టిఎన్ 3456 గల టాటా ఏసీని హుజూర్‌నగ ర్ నుంచి వస్తున్న ఏపీ 39 టిటి 1373 గల లారీ ఢీకొట్టడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివారాల్లోకి వెళ్తే పల్నాడు జిల్లా జాన్‌పాడు కి చెందిన ఆదినారాయణగా గుర్తించారు. అతని పని నిమిత్తం ఖమ్మం పోయి వస్తుండగా మార్గ మధ్యలో కవితా కాలేజ్ దగ్గర హుజూర్‌నగర్ నుంచి ఎదురుగా వస్తున్న లాటీ ఢీకోట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# విద్యా ప్రయివేటీకరణ

కాశ్మీర్‌ను రావణకాష్టం చేయడానికి బీజేపీ సర్కారుకు ఓటేసిన రెండు తెలుగు రాష్ట్రాల పాలక పార్టీలూ ప్రభుత్వాలూ తాజాగా విద్యా ప్రయివేటీకరణకు తెరలేపాయి. ప్రస్తుతం పేదలకు ఉన్న అత్తెసరు అవకాశాలను అటు ఏపీ ప్రభుత్వం, ఇటు తెలంగాణ సర్కారు అందకుండా చేస్తున్నాయి. ఇప్పటికే విద్యా ఆరోగ్య రంగంలో ప్రయివేటీకరణ నేపథ్యంలో సామాన్య ప్రజలు అష్టకష్టాలు ఎదుర్కొంటున్న సంగతి తెలుసు. నిరుపేద విద్యార్థులకు చదువుకునే పరిస్థితులు దుర్లభం అవుతుండగా, మరోవైపు ఆరోగ్యం గాల్లో దీపంలా మారింది. దశాబ్దాలుగా ఆయా ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను ప్రోత్సహించ కుండా ప్రయివేటుకు పెద్దపీట వేస్తున్నాయి. ఈ తరుణంలో సమాజంలో 90శాతంగా ఉన్న సామాన్య పిల్లలకు చదువు గగన కుసుమమే అవుతున్నది. అందని మానిపండుగా మారింది.

ఇప్పటిదాకా పాఠశాలలు, కాలేజీలకే పరిమితమై ప్రయివేటీకరణ సాగగా, ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోని పాలకపార్టీలైన టీఆర్ఎస్, వైసీపీ ప్రభుత్వాల విధానాల నేపథ్యంలో ఏకంగా ప్రయివేటు విశ్వవిద్యాలయాలే కొలువు దీరనున్నాయి. దీంతో నిరుపేద విద్యార్థులకు చదువుకోవడానికి గల అవకాశాలూ పరిస్థితులూ కృశించిపోతున్నాయి. అలాగే చదువును ఖరీదు చేయగలిగిన ఉన్నత వర్గాలకే విద్య అందనుంది. విద్యావ్యవస్థను గాడిన పడేస్తానని, దారిలో పెడతానంటూ గాంభీర్యం మాటలు చెప్పిన టీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్, తొలుత బడ్జెట్‌లో విద్యారంగానికి దాదావు 10శాతం నిధులు కేటాయించారు. అయితే ఈ కేటాయింపులు గత ఏడాదిలో ఆరుశాతానికే పరిమితం కావడం గమనార్హం. దీనిని ప్రశ్నిస్తే, ప్రభుత్వ ప్రాధాన్యతలు మారాయంటూ మళ్లీ దాటవేత మాటలు చెప్పుకుంటూ వస్తున్నారు. రేషనలైజేషన్ ద్వారా పిల్లలు లేరనే సాకుతో రాష్ట్రంలో దాదావు 4వేలకుపైగా స్కూళ్లను మూసేసారు. రాష్ట్రంలో జూనియర్ కాలేజీలు ప్రభుత్వరంగంలో 404 ఉంటే, ప్రయివేటులో 1700 ! ఇకపోతే 14 ఇంజినీరింగ్ కాలేజీలు ప్రభుత్వానివి కాగా, 180 ప్రయివేటుకు చెందినవి ఉన్నాయి!! ప్రస్తుతం ప్రభుత్వ పర్యవేక్షణలో 15 విశ్వవిద్యాలయాలు పనిచేస్తున్నాయి.

తాజాగా టీఆర్ఎస్ సర్కారు అసెంబ్లీలో బిల్లుపెట్టి మరీ ప్రయివేటు యూనివర్సిటీలకు గ్రీన్‌సిగల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో రిలయన్స్, టెక్‌మహీంద్రా, టాటా, ఒవైసీ సంస్థలు ప్రయివేటులో విశ్వవిద్యాలయాలను స్థాపించి లాభాలను దండుకునేందుకు సమాయత్తమవుతున్నాయి. తద్వారా విద్యావ్యాపారాన్ని మరింత విస్తృతం చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి. ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేసేందుకు సర్కారే స్వయంగా పావులు కదువుతుండటం, కార్పొరేట్ వర్గాలకు సహకరిస్తుండటం ఎంతమాత్రం సహించరానిది. ఇదిలా వుండగా నెమ్మదిగా ప్రభుత్వం విద్యారంగానికి నిధుల కేటాయింపులు తగ్గిస్తూ వస్తున్నది. అంతెందుకు 2017-18, 2018-2019 ఆర్థిక సంవత్సరాలకు గాను ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు రూ.3459 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయకుండా తొక్కిపెట్టింది. తద్వారా రాష్ట్రంలోని ఆయా వృత్తి విద్యాకోర్సులతో పాటు ఇతర చదువుల్లో ఉన్న 5 నుంచి ఆరు లక్షలమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలో పడేసింది. అంతేగాక ఇంతకుముందే కోర్సులు పూర్తయినా, ఫీజులు చెల్లించకపోవడంతో వారి సర్టిఫికెట్లను ఇవ్వకుండా ఆయా విద్యాసంస్థలు పేద విద్యార్థులను సతాయిస్తున్నాయి. ఉద్యోగావకాశాలను సైతం కోల్పోవడానికి కారణమవుతున్నాయి. అలాగే గత ఐదేండ్లుగా స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీల్లో దాదావు 25వేల పోస్టులను భర్తీచేయకుండా పెండింగ్‌లో పెట్టింది. ఇప్పుడు ప్రయివేటు యూనివర్సిటీల ద్వారా చదువును బహిరంగ వేలానికి అనుమతించింది. రాజ్యాంగ హక్కు అయిన రిజర్వేషన్లకు చెల్లుచీటీ పాడింది. 25శాతం స్థానికులకు సీట్లు ఇస్తామంటూనే, ఉన్నతవర్గాలకు మాత్రమే చదువుకునేలా చట్టబద్ధ అన్యాయానికి వొడిగడుతున్నది. తద్వారా టీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని కేజీ టూ పీజీ ఉచిత విద్య హామీని మూటగట్టి విసిరికొట్టింది. రాష్ట్రంలోనే కాదు దేశవ్యాప్తంగా ఉన్న వామపక్షాలు, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు, ఎన్జీవోలు, తల్లిదండ్రుల సంఘాలు, స్టూడెంట్ యూనియన్లు గొంతు చించుకుని విద్యా ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాటాలు చేస్తున్నా, అటు కేంద్రంలోని బీజేపీ, ఇటు రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వాలకు చీమకుట్టినట్టయినా లేకపోవడం దారుణం. ఇప్పటిదాకా ఉపాధి, పరిశ్రమలు, సెజ్‌ల పేర ప్రభుత్వ, రైతుల విలువైన భూములకు ఎసరుపెట్టిన విషయం అందరికీ ఎరుకే. తాజాగా ప్రయివేటు విశ్వవిద్యాలయాల పేర మరోసారి భూసంతర్పణకు టీఆర్ఎస్ సర్కారు సిద్ధమవుతున్నది. మానవవనరుల అభివృద్ధికి ఎంతో కీలకమైన విద్యారంగానికి నిధులు భారీగా కేటాయించాలని, అనేక కమిషన్లు చెప్పినా పాలకపార్టీలు పెడచెవిన పెడుతున్నాయి. సాధారణ కుటుంబాలకు చెందిన పిల్లలు ఎక్కడ చదవాలో అర్థంకాని పరిస్థితులు నెలకొనడం ఆందోళనకరం.

# రైతుపై తూటా

చందంపేట, మేజర్‌న్యూస్ ః రైతాంగ ఆత్మహత్యలు నివారిస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని హామీలిచ్చి కేంద్రంలోను, మధ్యప్రదేశ్‌లోను అందలమెక్కిన బీజేపీ ప్రభుత్వాలు అన్నదాతలపైనే తుపాకీ ఎక్కుపెట్టడం హేయమైన చర్య. ఒకవైపు కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ మరో వైపు రైతులను పిట్టలను కాల్చినట్టు కాల్చిపడేసిన పాలకుల కిరాతకాన్ని ఎంత ఖండించినా తక్కువే. మధ్యప్రదేశ్‌లో రైతులు తాము పండించిన పంటకు మద్దతు ధర కావాలని అడిగారు. ఎన్నికల ముందు బీజేపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మాత్రమే వారు కోరారు. రైతులపైకి పోలీసులను ఉసిగొల్పి ఆరుగురిని పొట్టనబెట్టుకోవడం దుర్మార్గం. సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ ప్రభుత్వమైనా నిర్వర్తించాల్సిన కనీస బాధ్యత. దీనిని విస్మరించి నిరంకుశంగా అణచివేయాలని చూడడం అప్రజాస్వామికం. మధ్యప్రదేశ్‌లో మొదట ఒక జిల్లాలో ప్రారంభమైన రైతుల ఆందోళన క్రమంగా రాష్ట్రంలోని మిగతా అన్ని జిల్లాలకు విస్తరించింది. మందసోర్, పిప్లియామండీ ప్రాంతాల్లో ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి రైతుల పోరాటాన్ని అణచివేయాలని చూసింది. ఈ పాపంలో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వానికీ వాటా వుంది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేండ్లు గడిచినా రైతాంగాన్ని ఆదుకునేందుకు ఎలాంటి చర్య తీసుకోలేదు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. నయా ఉదారవాద విధానాలతో ఇప్పటికే సంక్షుభితంగా మారిన వ్యవసాయరంగం మోడీ ప్రభుత్వ నిర్వాకం వల్ల మరింత తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడింది. మధ్యప్రదేశ్‌లో కాల్పులు దీనికి పరాకాష్ట. కేవలం ఒక్క మధ్యప్రదేశ్‌లోనే కాదు, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోను, దాని మిత్రపక్షాలు అధికారంలో వున్న రాష్ట్రాల్లోను రైతు వ్యతిరేక విధానాలు ఉధృతంగా అమలవుతున్నాయి. మొత్తం రైతు ఆత్మహత్యల్లో 60శాతం దాకా ఈ రాష్ట్రాల్లోనే చోటు చేసుకున్నాయని అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయి. మొదట గుజరాత్ రైతాంగం వీధుల్లోకి వచ్చింది. నేడు మహారాష్ట్రలో రైతాంగ పోరాటాలు ఉధృతంగా సాగుతున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ఈనాడు బీజేపీ ప్రభుత్వ విధానాలపై ఈ దేశ రైతాంగం తిరుగుబాటు చేస్తోంది. మధ్యప్రదేశ్‌లో రైతాంగ పోరాటం, మహారాష్ట్రలో రైతులు వారం రోజుల పాటు నిర్వహించిన సమ్మె, రాష్ట్ర బంద్ అసాధారణమైనది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర అనే కాదు, మిగతా రాష్ట్రాల్లోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై రైతాంగంలో ఆగ్రహం రగుల్కొంటోంది. చత్తీస్‌ఘడ్, హర్యానా, జార్ఖండ్‌ల్లో రైతాంగ పోరాటాలు సాగుతున్నాయి. రైతుల పోరాటానికి బాసటగా నిలవాలని సామాజిక కార్యకర్త అన్నా హజారేను రైతు సంఘాలు కోరగా ఆయన అందుకు నిరాకరించారు. ఇది ఆయన సంకుచిత ధోరణికి నిదర్శనం. ఎఐకెఎస్, ఇతర రైతు సంఘాల ఆధ్వర్యాన మహారాష్ట్ర రైతులు పట్టుదలతో పోరాడుతున్నారు. రైతులు తమ నిరసనలో భాగంగా వ్యవసాయోత్పత్తులను పట్టణాలకు సరఫరా చేయడానికి నిరాకరిస్తున్నారు. వాటిని రోడ్లపై పారబోస్తున్నారు. మహారాష్ట్రలోని ఫడ్నవీస్ ప్రభుత్వం రైతులతో చర్చించి సామరస్యంగా దీనిని పరిష్కరించుకోవడానికి బదులు ఈ ఉద్యమాన్ని అణచివేయాలని చూడడం అవివేకం. తమిళనాడులో 140ఏండ్లలోనే అతి పెద్దకరువు గత సంవత్సరం చోటు చేసుకుంది. ఈ కరువు బారిన పడి ఇప్పటివరకు 400మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విపత్కర పరిస్థితినుంచి తమిళనాడును ఆదుకునేందుకు 40వేల కోట్ల ప్యాకేజీ కావాలని తమిళనాడు రైతులు నలభై రోజులకుపైగా ఆందోళన నిర్వహించారు. రాజధాని ఢిల్లీలో దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. రైతులు ఎంత ఘోషించినా రుణమాఫీ చేసే ప్రసక్తే లేదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తెగేసి చెప్పారు. కరువుతో అల్లాడుతున్న తమిళనాడుకు ఇంతవరకు పైసా కూడా సాయం చేయలేదు. పైగా సుప్రీం కోర్టులో దీనిపై కేంద్రం తన వాదన వినిపిస్తూ తమిళనాడులో రైతులెవరూ ఆత్మహత్య చేసుకోలేదని చెప్పింది. ఇది తమిళప్రజలతో క్రూర పరిహాసమాడటమే. రైతులను ఉద్ధరించేందుకే తెచ్చానని ఘనంగా చెప్పుకున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన రైతులకు అక్కరకు రాలేదు. కానీ కార్పొరేట్ బహుళజాతి కంపెనీలకు దండిగా కాసులపంట పండించింది. ఫసల్ బీమా యోజన కింద 2016-17లో ప్రయివేట్ బీమా కంపెనీలు ప్రీమియం రూపంలో రైతుల నుంచి 21,500 కోట్లు దండుకున్నాయి. గత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పరిహారం కింద 4,270 కోట్లు క్లెయిమ్ చేయగా, 714 కోట్లు మాత్రమే ఇచ్చాయి. దీనిని బట్టి ఈ ఫసల్ బీమా యోజన ఎవరికోసం ఉద్దేశించిందో ఇట్టే అర్థమవుతోంది. వ్యవసాయరంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడం, మేడ్ ఈజీ బిజినెస్ వంటి విధానాల ద్వారా మోడీ సర్కార్ ఈ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్నది. దీనికి వ్యతిరేకంగా గ్రామీణ పేదలు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఆదివాసీలు సమైక్య పోరాటాలను ఉధృతం చేయడం ఒక్కటే మార్గం.

# వివక్ష లేని సమాజం కోసం

సమాజంపై అవగాహన ఎందరికో ఉండొచ్చు... మార్చాలనే తపన కొందరికే ఉంటుంది. అలా తపించే వారిలో ప్రొఫెసర్ లక్ష్మి ఒకరు. సమానత్వం, వివక్ష లేని మరో సమాజం కోసం నిరంతరం పోరాడుతున్నారు. విద్యార్థి దశ నుంచే హ్యూమనిస్టుగా, యాక్టివిస్టుగా స్త్రీ సమానత్వం కోసం గొంతు విప్పారు. ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీకి మొదటి మహిళా ప్రిన్సిపల్‌గా చరిత్ర సృష్టించారు. రిటైర్‌మెంట్ తర్వాత కూడా స్త్రీ సమస్యలపై తన పోరాటం ఆపలేదు. ముఖ్యంగా ఇటీవల రాష్ట్రంలో పెట్రేగుతున్న కుల దురహంకార హత్యలకు వ్యతిరేకంగా తన గొంతు విప్పుతున్న ఆమెతో మానవి సంభాషణ...

ఇటీవల మన రాష్ట్రంలో కులదురహంకార హత్యలు బాగా జరుగుతు న్నాయి. వీటికి కారణం ఏమిటి?

ఇవి గతంలో కూడా ఉన్నాయి. అయితే బయటకు వచ్చే వాటి సంఖ్య చాలా తక్కువ. ఇప్పుడు మీడియా పెరిగిపోవడం వల్ల బయటకు ఎక్కువగా వస్తున్నాయి. కులం, మతం, మూఢనమ్మకాలు, సంప్రదాయాలు, ఇలా వీటన్నింటి వల్ల తల్లిదండ్రులు, కులపెద్దలు పిల్లల ఇష్టాలను అంగీకరించడం లేదు. రోజురోజుకు సమాజంలో కుల సమస్య పెరిగిపోతుంది. అందుకే ఈ హత్యలు జరుగుతున్నాయి.

ఈ వివాహాల వల్ల అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలు?

మొదట తల్లిదండ్రులు ఆమె ప్రేమను అంగీకరించరు. ఇంట్లో వాళ్ళ ఇష్టాన్ని కాదని పెండ్లి చేసుకుంటే ఇల్లు వదిలి వెళ్ళిపోవాలి. సమాజం కూడా అమ్మాయి నిర్ణయాన్ని స్వాగతించదు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక్కరికైనా ఉద్యోగం లేకపోతే బతకడం కష్టం.

సూర్య


## అల్పాహారం అందజేత







కోదాడ టౌన్, మేజర్ న్యూస్ : వాసవి క్లబ్ ఆధ్వర్యంలో హుజూర్ నగర్ రోడ్డులో పశువుల సంత ఏరియాలో రైతులు, పాదచారులకు అల్పాహారం అందజేశారు. మాస శివరాత్రి సందర్భంగా వాసవీ క్లబ్ ఉపాధ్యక్షుడు చీదెళ్ల వెంకట సాంబ శివరావు, ఉమా మహేశ్వరి దాతృత్వంతో సంతకు వచ్చిన వారికి పులిహోర, దద్దోజనం, వాటర్ అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు వంగవీటి నాగరాజు, చిత్తలూరి భాస్కర్‌రావు, వెంపటి ప్రసాద్, చల్లా లక్ష్మీనర్సయ్య, ఇమ్మడి సతీష్, గరిణె శ్రీనివాస రావు, బండారు శ్రీనివాసరావు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా సురేష్ రావు జన్మదిన వేడుకలు



పెన్‌పహాడ్, మేజర్‌న్యూస్ : కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్ రావు జన్మదిన వేడుకలను మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని లింగాల గ్రామంలో ఆ పార్టీ మండల నాయకుడు దొంగరి గోపికృష్ణ, నారాయణగుడెం గ్రామంలో గ్రామశాఖ అధ్యక్షుడు నారాయణ ప్రవీణ్ రెడ్డి, అనంతారం గ్రామంలో గ్రమశాఖ అధ్యక్షుడు గజ్జల సైదిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం బాణాసంచా పేల్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జుకురి గాంధీ, మామిడి చంద్రం, మజ్జిగపు నర్సిరెడ్డి, వెంకటరెడ్డి, చాందు, వీరభద్రం, రణపంగ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ డిఆర్‌డిఎ పిడిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు

### కెవిపిఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ ఎస్సీ ఎస్టీ కమీషన్ ఇచ్చిన ఫిర్యాదులో భాగంగా కేసు నమోదు

### దళిత ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదు... కెవిపిఎస్

చివ్వెంల మేజర్ న్యూస్ః గతంలో సూర్యాపేట జిల్లా డీఆర్‌డిఎ పీడిగా పనిచేసిన సుందరి కిరణ్ కుమర్‌పై కెవిపిఎస్ పోరాట ఫలితమే చివ్వెంల పోలీస్ స్టేషనల్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదయ్యింది. వివరాల్లోకి వెలితే 2023 సంవత్సరం సెప్టెంబర్ నెలలో చివ్వెంల మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల సామాజిక తనికి సందర్భంగా మండల కేంద్రంలో జరిగిన సామాజిక తనిఖీ సభలో ఉపాధి హామీ ఏపీవోగా పనిచేస్తున్న దళిత అధికారి ఇరుగు నాగయ్యను డిఆర్‌డిఎ పిడి కిరణ్ కుమార్ సభలో అవమానపరిచే విధంగా దళిత ఉద్యోగి ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా నీకు ఈ వేదిక మీద కూర్చునే అర్హత లేదు వేదిక దిగి క్రింద కూర్చోపో అంటూ మండలంలోని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది అందరి ముందు అవమానించడం జరిగింది. అందుకుగాను అప్పుడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావుకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. తదానంతరం రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్, జాతీయ ఎస్సీ ఎస్టీ కమీషన్‌లకు కూడా ఫిర్యాదు చేయడం జరిగింది. అప్పటి ప్రభుత్వం అతనిపై చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేసింది. కెవిపిఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఎస్సీ ఎస్టీ కమీషన్‌కు ఫిర్యాదు ఇచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం పిడి పై చివ్వెంల పోలీస్ స్టేషన్లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయడం జరిగింది. దళిత ఉద్యోగులను అవమాన పరిచినా, వేధింపులకు గురి చేసినా కెవిపిఎస్ అండగా ఉంటుందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి తెలిపారు.

### గత డిఆర్‌డిఓ సుందర కిరణ్ కుమార్ పై

## ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు

### సామాజిక తనిఖీలు అవమానించారని ఏపిఓ నాగయ్య ఫిర్యాదు

### గతంలో కలెక్టర్ ఎస్సీ ఎస్టీ జాతీయ కమీషన్ ఆశ్రయించిన బాధితుడు

### ఎట్టకేలకు కేసు నమోదు చేసిన చివ్వెంల పోలీసులు

చివ్వెంల మేజర్‌న్యూస్ ః సూర్యాపేట జిల్లాలో సుదీర్ఘ కాలంగా పనిచేసిన గత డిఆర్‌డిఓ సుందరి కిరణ్ కుమార్ పై చివరికి పోలీస్ స్టేషన్లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదయింది. సామాజిక తనిఖీలు తనను అవమానించారంటూ ఏవీఓ నాగయ్య గతంలో ఉన్న జిల్లా కలెక్టర్ ఎస్సీ ఎస్టీ జాతీయ కమీషన్‌ను అశ్రయించిన ఫలితం లేకపోవడంతో శనివారం చివ్వెంల పోలీస్ స్టేషన్లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత సంవత్సరం 9వ నెల 19వ తేదిన మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీలు టేబుల్ ఫ్యాన్ ఏర్పాటు చేయలేదని దళితుడిని తనను అవమానించాడని ఏపివో నాగయ్య తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. గతంలో ఇదే విషయంలో ఇదే పోలీసులను ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని దీంతో స్థానిక కలెక్టర్ ఎస్సీ ఎస్టీ జాతీయ కమీషన్ ఆశ్రయించిన ఫలితం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో ఏపీవో నాగయ్య ఫిర్యాదు మేరకు గత డిఆర్డీఓ సుందరి కిరణ్ కుమార్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి వెంకటరెడ్డి తెలిపారు.

## బడుల బలోపేతానికి అమ్మ ఆదర్శ కమిటీలు

### యాజమాన్య కమిటీల స్థానంలో అమ్మ ఆదర్శ కమిటీలు మహిళా సమాఖ్యల భాగస్వామ్యంతో ఏర్పాటు

### కన్వీనర్‌గా ప్రధానోపాధ్యాయుడు కమిటీ చైర్మన్‌గా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

శాలిగౌరారం మేజర్ న్యూస్ః తెలంగాణ ప్రభుత్వం సర్కారు బడ్డుల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాల కల్పన పై ప్రత్యేక దృష్టి సాధించింది. దీంట్లో



భాగంగా నిర్వహణకు అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీలకు ఏర్పాటు చేస్తుంది. వీటిల్లో మహిళ సమాఖ్యలను భాగం చేస్తున్నారు. పూర్తిగా మహిళా సంఘాల సభ్యులతో గత పాఠశాల యాజమాన్య కమిటీల స్థానంలోనే ఈ కమిటీలను వేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య వసతులు మెరుగుపడాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశం. జిల్లాలో ప్రాథమిక -1126, ప్రాథమికోన్నత-127, జెడ్పి-230, ఆదర్శ పాఠశాలలు-32, కెజిబివిలు -18 కలిపి 1533 పాఠశాల యాజమాన్య కమిటీల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం జనవరి 18న కొత్త కమిటీల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. పాత కమిటీలను రద్దు చేయడంతో నాలుగు నెలలుగా నిర్వహణ ఖర్చులు, మన ఊరు-మన బడి బిల్లులు తదితర వాటి కోసం ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో ఈ సమస్య తీరనుంది. పాఠశాలల్లో నాణ్యమైన విద్య, భోజనం, వసతులు మెరుగుకు కృషి చేయాలి, విద్యుత్తు, మరుగుదొడ్లు, సురక్షితమై తాగునీరు, సౌకర్యం ఉండేలా చూసుకోవాలి. బడుల భవనాలు, మూత్రశాలలు శిథిలమైతే మరమ్మత్తులు, పునరుద్దరణ పనులు నిర్వహించాలి ప్రాంగణంలో పరిశుద్య నిర్వహణ జరిగేలా చూడాలి. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా ఏకరూప దస్తులు కుట్టించాల్సిన బాధ్యతను కమిటీలకు అప్పగించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం విద్యార్థుల ప్రగతి, ఆరోగ్య పరీక్షలు తదితరు అవసరాలను కమిటీలు బాధ్యత వహించాలి.

***చాలా పాఠశాలల్లో పూర్తయింది.***

***నాగయ్య మండల విద్యాధికారి***

ప్రభుత్వం అన్ని సర్కారు బడుల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను వేయాలని ఉత్తర్వులు వెలువరించింది. ఈ మేరకు పాఠశాలల్లో కమిటీల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాం, ఇప్పటికే చాల పాఠశాలల్లో కమిటీలు వేయడం పూర్తయింది.

## ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



తిరుమలగిరి మున్సిపాలిటీ మేజర్ న్యూస్ః తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారంలోని మోడల్ స్కూల్లో ఆదివారం ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల ఛీఫ్ సూరరిండెంట్ వేముల బాలరాజు మాట్లాడుతూ పరీక్షలకు 133 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 113 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపార్మెంటల్ అధికారులు అశోక్ రెడ్డి, సోమ సుందర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి చేరిన గుండాల మండల నాయకులు

### కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

గుండాల మేజర్ న్యూస్ః బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీ సొంతగూటికి చేరుకున్నారు. గుండాల మండల మాజీ పార్టీ అధ్యక్షుడు, డిసిసిబి మాజీ డైరెక్టర్ మరిపడిగా గ్రామ మాజీ సర్పంచ్ దుంపల శ్రీనివాస్, ఆదివారం రోజు యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే సమక్షంలోకాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు మాజీ ఎంపిటిసి బోయిని రామ్మల్లు, తదితరులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు.



# ఘనంగా దుర్గామాత, సంత్ సేవాలాల్ ఉత్సవ వేడుకలు



నూతనకల్, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని దిర్శనపల్లి గ్రామంలో శ్రీ దుర్గామాత, సంత్ సేవాలాల్ ఉత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను ప్రతిష్టింపజేసి జల బిందెలు, బోనాలు చెల్లించుట వంటి కార్యక్రమాలు నిర్వహించి అనంతరం ఘనమైన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయంలో విశేష పూజలు

## యాదాద్రిలో భక్తుల రద్దీ

## భక్తులను అడిగి తెలుసుకుంటున్న ఆలయ ఈవో భాస్కరరావు





యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : యాదాద్రి ఆలయ పరిసరాల్లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయని భక్తులను అడిగి తెలుసుకుంటున్న ఆలయ ఈవో భాస్కర్ రావు. ఆదివారం యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. యాదాద్రి ఆలయ సన్నిధిలో భక్తుల రద్దీతోఆలయ పరిసరాలన్ని భక్తులతో కిటకిటలాడుతున్నాయి. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దర్శనానికి క్యూలైన్లో భక్తులు బారులు తీరారు. దీనితో స్వామి వారి ఉచిత ప్రవేశ దర్శనానికి దాదాపు 2 గంటలు, ప్రత్యేక దర్శనానికి దర్శనానికి దాదాపుగంట సమయం పడుతుంది. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ప్రసాద విక్రయశాల, సత్యనారాయణ స్వామి వ్రతమండపం, కొండక్రింద విష్ణుపుష్కరణి, కారు పార్కింగ్, బస్టాండ్‌లో భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచే స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నభక్తులు. ఉదయం నిత్య కైంకర్యాలతో మొదలై రాత్రి శయనోత్సవంతో ముగిసాయి. ఆదివారం వివిధ కైంకర్యాలలో వచ్చిన ఖజానా 40,32,766.

# రామచంద్రారెడ్డి కుటుంబానికి పరామర్శ



పెన్‌పహాడ్, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామానికి చెందిన నారాయణ రామచంద్రారెడ్డి ఇటీవల మరణించగా ఆదివారం ఆయన దశదిన కార్యక్రమానికి బిఆర్ఎస్ జిల్లా నాయకులు సంకరమద్ది శ్రవణ్ రెడ్డి హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు రామచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నారాయణ హిమాకర్ రెడ్డి, రామినేని కృష్ణయ్య, సంకరమద్ది నాగిరెడ్డి, నరేందర్ రెడ్డి, మల్లికార్జున్, రామిరెడ్డి, వెంకటరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ వాది పెరుమాళ్ళ కృష్ణయ్య మృతి పట్ల పలువురి సంతాపం



మునుగోడు, మేజర్‌న్యూస్ : మునుగోడు పట్టణానికి చెందిన పెరుమాల్ల కృష్ణయ్య గత కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై శనివారం రాత్రి మరణించారు. కృష్ణయ్య కు ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈయన ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ శాఖలో విశ్రాంత ఉద్యోగి, అంబేద్కర్ వాది,ఆయన మృతి పట్ల ఆదివారం పలువురు పార్థివ దేహాన్ని సందర్శించి, సంతాపం తెలిపి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈయన ఉద్యోగం చేస్తూనే గ్రామంలోని యువతీయువకుల విద్యాభ్యాసం కోసం తోడ్పాటునందిస్తూ ఉన్నత చదువులకు ప్రోత్సహించేవారని తెలిపారు మరోవైపు అంబెద్కర్ సిద్ధాంతం, ఆశయాలను యువతకు తెలియపరుస్తూ భావి పౌరులుగా తీర్చిదిద్దేందుకు శ్రమించారని అన్నారు. ఇందుకై 1988లోనే మునుగోడులో డాక్టర్ బి అర్ అంబేద్కర్ యువజన సంఘంను స్థాపించి సంఘం ఆధ్వర్యంలో అనేక సాంఘిక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఆయన ప్రేరణ, తోడ్పాటుతో ఇతర గ్రామాల్లోనూ యువకులు సంఘాలను నెలకొల్పుకున్నారన్నారు. వారి ముగ్గురు కుమారులను ఉన్నత చదువులు చదివించడంతో పాటు ఉన్నత ఉద్యోగాలు పొందేలా కృషి చేసి, వారి ఇష్టం మేరకు వారి వివాహాలకు అభ్యంతరం తెలుపకుండా ఆదర్శ వివాహాలను జరిపించారన్నారు. ఆయన మృతిపట్ల పట్టణంతో పాటు మండలంలోని అంబెద్కర్ యువజనసంఘాల ప్రతినిధులు, గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు, పెద్ద ఎత్తున తరలివచ్చి సంతాపం తెలియజేసి ఆయన సేవలను కొనియాడారు.

# పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

## - మండల వైద్యాధికారి స్రవంతి

పెన్‌పహాడ్, మేజర్‌న్యూస్ : పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మండల వైద్యాధికారి స్రవంతి మండల ప్రజలను కోరారు. ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎండ తీవ్రత నుండి రక్షణ కోసం ఎక్కువగా నీరు, కొబ్బరి నీరు త్రాగాలని, వేసవిలో కాటన్ దుస్తులు మాత్రమే వాడాలని, రసాయనాలతో తయారైన కూల్ డ్రింక్స్‌ను త్రాగవద్దని ఆమె ప్రజలకు సూచించారు. ఎండలో ఎక్కువగా ప్రయాణం చేసిన, ఎండ తీవ్రతలు వ్యవసాయ పనులు చేసిన, ఎండ తీవ్రతకు చెమట రాకుండా ఉన్నప్పుడు పూర్తిగా నీరసంగా, మూర్ఛలాగా నరాలు పని చేయనప్పుడు అత్యవసరంగా వైద్యశాలలో సంప్రదించాలని ఆమె ప్రజలకు సూచించారు. ఉపాధి హామీ కూలీలు వేసవిలో వడదెబ్బ నుంచి కాపాడుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం తాగాలని ఉపాధి హామీ ప్రదేశములో నీడ, తాగునీరు, ప్రథమ చికిత్స పెట్టెలు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి గ్రామములో ఆరోగ్య సిబ్బంది వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు ఆమె పేర్కొన్నారు.



# కాంగ్రెస్‌లోకి చేరిన గుండాల మండల నాయకులు

## కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీ సొంతగూటికి చేరుకున్నారు. గుండాల మండల మాజీ పార్టీ అధ్యక్షుడు, డిసిసిబి మాజీ డైరెక్టర్ మరిపడిగా గ్రామ మాజీ సర్పంచ్ దుంపల శ్రీనివాస్ ఆదివారం యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. వీరితోపాటు మాజీ ఎంపిటిసి బోయిని రామ్మల్లు, తదితరులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు.

# భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా సీపీఎం పార్టీ నుండి పోటీ చేస్తున్న కామ్రేడ్ జహంగీర్‌ను గెలిపించండి

## కౌన్సిలర్ దండ హిమబిందు అరుణ్ కుమార్



చౌటుప్పల్, మేజర్ న్యూస్ : పార్లమెంట్ అభ్యర్థిగా సిపి ఎం పార్టీ నుండి పోటీ చేస్తున్న కామ్రేడ్ జహంగీర్ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని దండ హిమ బిందు అరుణ్ కుమార్ కోరారు. ఆదివారం పత్రిక ప్రకటన ద్వారా వారు తెలియజేస్తూ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ఇతర పార్టీల అభ్యర్థులు ఎవరు కూడా ప్రజల్లో ఉండరని, ప్రజలతో గాని ప్రజా సమస్యలపైన పోరాడిన చరిత్ర గాని వారికి లేదన్నారు. కేవలం ధన అహంకారంతో అధికారం కోసం తాపత్రయ పడుతున్నారని రోజుకో పార్టీ మారి పూటకో మాట మాట్లాడే ఇలాంటి అభ్యర్థులను ప్రజలు నమ్మకూడదని నిరంతరం ప్రజల పక్షాన పోరాడి ప్రజల్లో మమేకమై ప్రజా సమస్యలే తన అజెండాగా మార్చుకొని ప్రజల కోసం పనిచేస్తున్న కామ్రేడ్ జాంగీర్‌ని ప్రజలు ఆధరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మన బోనగిర్! మన జహంగీర్! అనే నినాదంతో ప్రజల మనిషి జాంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు తెలియజేశారు.

సూర్య
సోమవారం
8 ఏప్రిల్ 2024

## కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే ప్రభుత్వం : సత్యం శ్రీరంగం



కూకట్ పల్లి మేజర్ న్యూస్ : కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశము బాలానగర్ డివిజన్ అధ్యక్షులు మధు గౌడ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా మల్కాజ్ గిరి పార్లమెంటు అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి కుమారుడు పట్నం రినీష్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో తుక్కుగూడలో విడుదల చేసిన ఆరు గ్యారెంటీల మేనిఫెస్టో ప్రజలను ఆకట్టుకుందని, దీంతో ప్రజలు కాంగ్రెస్ ను నమ్మి ఓటేసి గెలిపించారన్నారు. వారి నమ్మకాలని గౌరవిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 100 రోజులలోనే ఐదు గ్యారెంటీలను అమలు చేయడం జరిగిందన్నారు. అంతే కాకుండా నిన్న జరిగిన తుక్కుగూడ బహిరంగ సభలో రాహుల్ గాంధీ గారు ఆవిష్కరించిన మేనిఫెస్టోలో నారి న్యాయ్ కూడా ఉందని అంటే మహిళలకు న్యాయం చేయడంలో భాగంగా పేద కుటుంబంలోని మహిళలకు ఏడాదికి ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, మహిళల శ్రేయస్సు కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే ప్రభుత్వం అన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీగా రేవంత్ రెడ్డి ని ఘన విజయంతో గెలిపించినట్లుగానే ప్రస్తుత కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి ని కూడా గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కూకట్ పల్లి నియోజకవర్గ బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా బ్లాక్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాళ్లు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ మరియు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మట్టి పైపుల నిర్మాణ పరిశ్రమలను ప్రభుత్వం ఆదుకోవాలి

**- పర్యావరణహితం కోసం ప్లాస్టిక్ పైపులను నిషేధించాలి - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మట్టి పైపుల పరిశ్రమలను కాపాడాలి**

**- తెలంగాణ ఎస్ డబ్ల్యూ జి పైప్ మ్యానుఫ్యాక్చర్స్ అసోసియేషన్ నేతల డిమాండ్**




హిమాయత్ నగర్ , మేజర్ న్యూస్ : ఎస్ డబ్ల్యూ జి (డ్రైనేజీ)ల నిర్మాణంలో మట్టి పైపులకు బదులుగా, ప్లాస్టిక్ పైపులను వాడితే పర్యావరణానికి హానితోపాటు ... వందల ఏళ్లుగా జీవనోపాధిగా నిలుస్తున్న పరిశ్రమలు మూతపడే ప్రమాదం ఉందని తెలంగాణ ఎస్ డబ్ల్యూ జి పైప్ మ్యానుఫ్యాక్చర్స్ అసోసియేషన్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం బషీర్బాగ్, ప్రెస్ క్లబ్లో అసోసియేషన్ నేతలు బ్రిజ్ మోహన్, భూమయ్య గుప్తా ,వినోద్ రెడ్డి, మధుసూదన్ ,భాస్కర్ గుప్తలతో కలిసి అధ్యక్షులు పి. వర్రపసాదరావు మాట్లాడారు.. సీవరేజ్ లైన్ల నిర్మాణంలో ప్లాస్టిక్ పైపులను వాడితే మట్టి పైపులు తయారు చేస్తున్న దాదాపు 36 పరిశ్రమలు మూతపడే అవకాశం ఉందని అన్నారు. పర్యావరణానికి 100% అనుకూలమైన ఎస్ డబ్ల్యూ జి పైపులను ప్రభుత్వం వాడి, తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీటి నిర్మాణంలో ప్లాస్టిక్ పైపులను వాడితే మలమూత్రాలలో ఉన్న ఆమ్ల, క్షార, ఆల్కలైన్ రసాయనాలు పైపులను తినేయడం , ఎలుకలు పందికొక్కులు మరియు చెదలు ప్లాస్టిక్ ను సులువుగా నాశనం చేస్తాయని వెల్లడించారు. కానీ ఎస్ డబ్ల్యూ సి పైపులు 65% సిలికా మరియు 25% అల్యూమినియం కలిగిన తెల్ల మట్టి, బొగ్గుతో తయారు చేయబడతాయని, వీటిని 1000 నుంచి ఒక 1050 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు బట్టీలలో కాల్చబడుతాయని చెప్పారు. ఎస్ డబ్ల్యూ జి పైపులు రసాయనాలు వాడకుండా పూర్తిగా పర్యావరణానికి అనుకూలమైన వని వెల్లడించారు. ఈ కారణాల చేత ప్రభుత్వం వారు అన్ని జిహెచ్ఎంసి, హెచ్ఎం డబ్ల్యు ఎస్ ఎస్ సి బి, గ్రామపంచాయతీలు, డిటిపిసి లేఔట్లలో ఎస్ డబ్ల్యూ జి పైపులను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే దాదావు నాలుగు వేల మంది ఆధారపడిన మట్టి పైపుల పరిశ్రమలు మూతపడే అవకాశం ఉన్నందున తమను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

## కామ్రేడ్ దుర్గా ప్రసాద్ మరణం కార్మిక వర్గానికి తీరని లోటు



కాప్రా,మేజర్ న్యూస్. కామ్రేడ్ దుర్గా ప్రసాద్ మరణం కార్మిక వర్గానికి తీరని లోటని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఎస్ బోస్ అన్నారు. చర్లపల్లి, ఈసీ నగర్ లో కామ్రేడ్ దుర్గ ప్రసాద్ శనివారం అనారోగ్యంతో మరణించారని, వారి భౌతిక కాయానికి సీపీఐ,ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎర్ర జెండాను పార్థివ దేహానిపై కప్పారు.
ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఎస్ బోస్ మాట్లాడుతూ దుర్గాప్రసాద్ ఏఐటీయూసీ కార్మిక విభాగంలో ఎనలేని కృషి చేశారని, నిత్యం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార సాధన కోసం అవిరాళంగా కృషి చేశారని గుర్తు చేశారు. అటువంటి నిస్వార్థ వ్యక్తి మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు, సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు నర్సింహా, శ్రీ నారాయణ, సుధాకర్, ఏఐటీయూసీ నేతలు రాం ప్రభు, మోహన్, సూర్య ప్రకాష్, కృష్ణ రెడ్డి, పట్వారీ తదితరులు పాల్గొన్నారు.

## జాగ్వర్ గ్రూప్ సూర్య శానిటేషన్ నూతన షోరూంను ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నిజాంపేట్ మేజర్ న్యూస్ : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా విచ్చేసి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డితో కలిసి బాచుపల్లి వోల్వో సర్వీస్ సెంటర్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన జాగ్వర్ గ్రూప్ సూర్య శానిటేషన్ నూతన షోరూంను ఆదివారం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా అతిథులు ప్రొప్రైటర్ రవి కుమార్, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ చైర్మెన్ కిసాన్ కాంగ్రెస్ అన్వేష్ రెడ్డి, సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్, కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎంసి కాంగ్రెస్ అధ్యక్షుడు కోలన్ రాజశేఖర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఇందిరా, మహిళా నాయకురాలు సబిత జలంధర్ రెడ్డి, సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నేటితో ముగియనున్న హునర్ మహోత్సవ్ మేళా



హైదరాబాద్, మేజర్ న్యూస్:సికింద్రాబాద్ జింఖానా మైదానంలో గత నెల 28 న ప్రారంభమైన హునర్ మహోత్సవ మేళా సోమవారం తో ముగియనుంది. ఈ మేళా కు నగర ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని నిర్వాహకులు దీపక్ శుక్ల, రిషి కుమార్ లు తెలిపారు. ఆదివారం జింఖానా మైదానం లోని హునర్ మహోత్సవ మేళా కార్యాలయంలో వారు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇదే మైదానంలో గతంలో నిర్వహించిన మేళాకు దాదావు మంచి స్పందన వచ్చిందని ,మంచి వ్యాపారం జరిగినట్లు వారు వివరించారు. గతసారి కంటే ఎక్కువగా వ్యాపారం జరిగిందని, రంజాన్, ఉగాది పర్వదినాలను పురస్కరించుకొని వినియోగదారుల నుంచి మంచి స్పందన వచ్చిందని వారు తెలిపారు. ఇంటిల్లిపాదికి అవసరమైన దుస్తులు, గృహోపకర వస్తువులు, ఫుడ్ స్టాల్స్ ఒకే వేదికలో ఉండడంతో విజయవంతమైందన్నారు.

## గీతం స్కాలర్ జపమాల రాణికి పీహెచ్డీ



హైదరాబాద్, మేజర్ న్యూస్ ప్రతినిధి : గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, హైదరాబాద్ లోని గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని బి. జపమాల రాణిని డాక్టరేట్ వరించింది. 'సాధారణీకరించిన కుంభాకారం ద్వారా విరామం-విలువ ప్రోగ్రామింగ్ సమస్యల అధ్యయనం'పై ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ కుమ్మరి ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. రేఖ సిద్ధాంత వ్యాసం, సర్వోత్తమీకరణం సమస్య అనిశ్చితి డేటాను పరిష్కరించడానికి సాంకేతికతలను పరిచయం చేసిందని తెలిపారు. లాంజ్ ఫంక్షన్ సాడిల్ పాయింట్ పరిస్థితులు వివిధ రకాల విరామం విలువ ప్రోగ్రామింగ్ సమస్యలతో పాటు పరిష్కారాలు, వాటి నిర్మాణ లక్షణాలను కూడా పరిశీలించినట్టు డాక్టర్ కృష్ణ, వివరించారు.జపమాల రాణి సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్చార్జి ప్రిన్సిపాల్, గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం. రాజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అవగాహనతోనే ఆటిజంను జయించొచ్చు



సోమాజిగూడ/మేజర్ న్యూస్:తల్లిదండ్రులకు సరైన అవగాహన లేక, ప్రాథమిక దశలో పిల్లల్లో వచ్చే బుద్ధి మాంద్యం సమస్యను గుర్తించకపోవడంతోనే అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని దివీస్ ల్యాబ్ ఎండి డాక్టర్ మురళీ కృష్ణ దివిఅన్నారు. ప్రపంచ ఆటిజం డే సందర్భంగా బంజారాహిల్స్లోని కేబీఆర్ పార్కు వద్ద దివీస్ ఫౌండేషన్ ఫర్ గిఫ్టెడ్ చిల్డ్రన్ ఆధ్వర్యంలో ఆటిజం అవగాహన నడక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వ్యాధిపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని చిన్న వయసులోనే గుర్తిస్తే త్వరగా ఈ వ్యాధి నుంచి బయటపడవచ్చునని అన్నారు. తమ సంస్థ తరవున ఆటిజంతో బాధపడుతున్న చిన్నారుల స్వాంతన కోసం వారు ఆ సమస్య నుంచి బయటపడేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని అయినా కూడా దీని పట్ల అవగాహన ఎంతో అవసరమని అన్నారు. ఈ సందర్భంగా దివీస్ సంస్థకు చెందిన 300 మంది ఉద్యోగులతో పాటు వాకర్లు పెద్ద ఎత్తున ఈ అవగాహన నడకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో , దివీస్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.వి. రమణ, సిఎఫ్ ఓ ఎల్.కిషోర్ బాబు వైస్ ప్రెసిడెంట్లు ప్రకాశ్ దివి, ఎల్. రమేష్బాబు, డి. మధుబాబు, జీఎం లు కె. సుబ్బారావు, బి. వర ప్రసాద్, పి. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# తుక్కుగూడ జన జాతరకు భారీగా తరలి వెళ్ళిన కాంగ్రెస్ శ్రేణులు





నడిగూడేం, మేజర్‌న్యూస్ : తుక్కుగూడలో జరిగే జన జాతర సభకు నడిగూడేం మండల వ్యాప్తంగా నాయకులు కార్యకర్తలు భారీగా తరలి వెళ్ళారు. మండల కేంద్రం నుండి వెళ్ళుతున్న వాహనాలను ఎంపిటీసీ గుండు శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి రాహూల్ గాంధీని ప్రధాని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కంగ్ ప్రెసిడెంట్ గుండు పద్మా శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు, దున్న శ్రీనివాస్, నాయకులు నర్సిరెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

**మునగాలలో :** తుక్కుగూడలో జరిగే జన జాతర సభకు మునగాల మండల వ్యాప్తంగా నాయకులు కార్యకర్తలు భారీగా తరలి వెళ్ళారు. మండల కేంద్రం నుండి వెళ్ళుతున్న వాహనాలను మండల పార్టీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మూఢత్వానికి పరాకాష్ట

నల్గొండ, మేజర్‌న్యూస్ ః భారతీయ జనతా పార్టీకి చెందిన భోపాల్ ఎంపీ సాధ్వీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ మళ్లీ రెచ్చిపోయారు. అజ్ఞానాన్ని, అశాస్త్రీయతను, మూఢనమ్మకాలను, అబద్ధాలనూ ప్రచారం చేయడంలో పేరు గాంచిన ప్రజ్ఞాసింగ్ ఇప్పుడు చేతబడులపై పడ్డారు. ఇటీవల మరణించిన తమ పార్టీనేతలు అరుణ్‌జైట్లీ, స్మృస్వరాజ్‌లు ప్రతిపక్షాలు చేసిన చేతబడుల కారణంగానే చనిపోయారని ఆమె శెలవిచ్చారు. సోమవారం భోపాల్‌లో జరిగిన జైట్లీ సంతాపసభలో ఆమె మాట్లాడుతూ "మీరు నమ్మండి.. నమ్మకపోండి.. నేను చెప్పింది నిజం.. జరిగిందదే.. ప్రతిపక్షాల చేతబడుల కారణంగానే జైట్లీ, స్మృలు మరణించారు' అని స్పష్టం చేశారు. తాను పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో ఉండగానే ఓ సాధువు "చెడుకాలం రాబోతున్నందున జాగ్రత్తగా ఉండాలని" హెచ్చరించారనీ, అయితే తాను ఆవిషయం మరచిపోయాననీ జైట్లీ, స్మృ మరణాల తరువాత స్వామీజీ చెప్పిన సంగతి తనకు గుర్తుకొచ్చిందనీ ప్రజ్ఞా చెప్పుకొచ్చారు. ఇలాంటి అసత్యాలను, మూఢనమ్మకాలను ప్రచారం చేయడం ప్రజ్ఞాకు కొత్తేమీ కాదు. తన ఎన్నికల ప్రచార సమయంలోనే ఆమె "మాలేగావ్ పేలుళ్ల కేసులో నన్ను అరెస్టు చేసిన ఏటీఎఫ్ చీఫ్ హేమంత్ కర్కరే నా శాపంతోనే మరణించారు" అన్నారు. ఆమె మాటలపై అప్పుడు దేశ వ్యాప్తంగా పెద్ద దుమారం రేగినా, ఆమె తీరు మాత్రం మారలేదు.. అయినా, ఇలా మూఢనమ్మకాలను ప్రచారం చేయడం, అందునా ఓ అత్యున్నత చట్టసభకు చెందిన ప్రజాప్రతినిధిగా ఈ ప్రచారం చేయడం రాజ్యాంగ వ్యతిరేకం, చట్టవిరుద్ధమని తెలిసినా బిజేపీ ఆమెపై ఎలాంటి చర్యా తీసుకోవడం లేదు. ప్రభుత్వం కూడా ఆమె నోటికి అడ్డుకట్ట వేయడం లేదు. పైపెచ్చు ప్రజ్ఞాసింగ్ సహచర ఎంపీ సాక్షి మహరాజ్ లాంటి వాళ్ళు ఆమెను బహిరంగంగా వెనకేసుకు వస్తున్నారు. ప్రోత్సహిస్తున్నారు. జేజేలు పలుకుతున్నారు.

ఈ మూఢత్వం కేవలం వ్యక్తులకు మాత్రమే పరిమితమైనది కాదు. వాస్తవానికి కమలనాథుల భావజాలమే అశాస్త్రీయతపై ఆధారపడినది. బీజేపీ ప్రచారం చేసే భావజాలంలో శాస్త్రీయత మచ్చుకైనా కనిపించదు. ఆ అశాస్త్రీయ భావజాలాన్ని మనస్ఫూర్తిగా నమ్ముతున్నారు కాబట్టే ప్రధాని మోడీ సైతం "మనకు ప్లాస్టిక్ సర్జరీ పురాణకాలంలోనే ఉంది. కాబట్టే గణేశుడికి ఏనుగు తలను అద్భుతంగా అతికించడం జరిగింది" అని పబ్లిక్‌గా ప్రవచించారు. ఒక ప్రజాస్వామ్య దేశపు ప్రధాని ఇంత అశాస్త్రీయతను ప్రచారం చేయడాన్ని చూసి ప్రపంచమే విస్తుపోయింది. అయినా బీజేపీ మోడీనే వెనకేసుకు వచ్చింది. ఆ బాటనే నడుస్తోంది. సాక్షాత్తూ దేశ ప్రధానే అలా మాట్లాడటం చూసి ప్రజ్ఞాసింగ్ లాంటి వారు మరింతగా రెచ్చిపోతున్నారు. పచ్చి అబద్ధాలను, మూఢనమ్మకాలను ప్రచారంలో పెడుతున్నారు.

మూఢత్వాన్ని నమ్మడం మూర్ఖత్వం. మూఢత్వాన్ని ప్రచారం చేయడం నేరం. నేరస్వభావులు మాత్రమే ఈ పని చేస్తారు. ప్రజలను మూఢత్వంలో ముంచి మత మనుగడ సాగించుకునేందుకు ఆరాటపడతారు. ఇప్పుడు కమలనాథులు ఆపనే చేస్తున్నారు. అబద్ధాలతో, అభూత కల్పనలతో, అశాస్త్రీయతతో ప్రజలను మభ్యపెట్టి, మాయచేసి, ఆశపెట్టి, భయపెట్టి తమ వెనకాల సమీకరించుకుంటున్నారు. అలా సమీకరించుకున్న జనాన్ని ఓట్లుగా మార్చుకుని రాజ్యమేలుతున్నారు. పాలకులు ఎవరైనా హేతుబద్ధ భావజాలాన్ని ప్రచారం చేయాలని రాజ్యాంగం నిర్ధేశిస్తున్నా, మూఢ నమ్మకాలను ప్రచార చేయడం నేరమని చట్టం స్పష్టం చేస్తున్నా మోడీ నుంచి ప్రజ్ఞాసింగ్ వరకు కమలనాథులంతా ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు. ఎందుకంటే ప్రజల దృూఎష్టిని, ఆలోచనలనూ ప్రక్కదారి పట్టించేందుకు. భారత ఆర్థిక వ్యవస్థను ప్రయివేట్, విదేశీ బహుళజాతి సంస్థల చేతుల్లో పెడుతున్న కారణంగా నేడు ప్రజలలో ఆకలి, అశాంతి పెరిగిపోతున్నాయి. ప్రజల ఆలోచనలను ఆవైపు నుంచి మళ్లించకుంటే వాళ్ళు తిరగబడడం ఖాయం. అప్పుడు మొదటికే మోసమొస్తుంది. ప్రజల ఆలోచనలను మొద్దుబార్చేందకు, దారితప్పించేందు మూఢత్వమే మేలైన మార్గం. అందుకే ఆ మార్గాన్ని ఎంచుకున్నారు.

అవును! ఇదంతా ఎవరో ప్రజ్ఞాసింగ్ లాంటి కొందరు వ్యక్తులు చేస్తున్న నేరం కాదు. ఇదొక వ్యవస్థీకృూఎత నేరం. చాలా పద్ధతిగా, పకడ్బందీగా, జాగ్రత్తగా, సంస్థాగతంగా చేస్తున్న వ్యవస్థీకృూఎతం నేరం. ఇందులో ప్రజ్ఞా సింగ్ లాంటి వాళ్ళు తెరముందటి పాత్రధారులు. ఇలాంటి సుశిక్షుతులైన పాత్రధారులు ఇప్పుడు మన దేశంలో తెరముందు, వెనుక లక్షల మంది ఉన్నారు. వీరి చేతుల్లోనే ప్రజలల్లో శాస్త్రీయ, హేతువాద భావజాలన్ని పెంచి, వారిముందు వెలుగు దారులు పరవాలని ప్రయత్నిస్తున్న కల్బుర్గీ, దబోద్కర్ లాంటి మానవతా మూర్తులు దారుణంగా చంపబడుతున్నారు.

శాస్త్రీయతకు, హేతువుకు తమ భావజాలం చుక్కెదురని, ప్రజలు మూఢత్వాన్ని వీడితే తాము మనుగడ సాగించడం అసాధ్యమనీ కమలనాథులకు, వారి సోదరులైన సంఘ్ పరివార్ శక్తులకూ మాబాగా తెలుసు. కాబట్టే, అనుక్షణం ప్రజలను మూఢత్వంలో ముంచేందుకు ప్రయత్నిస్తున్నారు. వీరిని ఎదుర్కోకుంటే, ప్రజలనుంచి వీరిని వేరు చేయకుంటే ఈ దేశం చీకటి యుగంలోకి తిరిగి పయనిచడం తథ్యం. ఈ నేపథ్యంలో ఈ ప్రజా వ్యతిరేక శక్తులను ప్రతి చోట, ప్రతిఘటించడం ప్రగతిశీల శాస్త్రీయ శక్తుల కర్తవ్యం.

## ద్వంద్వ నీతి

హాలియా, మేజర్‌న్యూస్ ః కేంద్రంలో ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షాల రాజకీయ విన్యాసాలు ఆందోళనకరం. ప్రజా పరిపాలనను గాలికొదిలేసి, కార్పొరేట్లకు మద్దతునివ్వడం, వారి అడుగులకు మడుగులొత్తుతూ రూపొందించిన చట్టాలను యిష్టారాజ్యంగా రద్దుచేస్తూ రాజకీయకద్రకు శ్రీకారం చుట్టారు. ప్రజల భావోద్వేగాలతో ఆటలాడుతూ ప్రమాదకర చర్యలకు పూనుకుం టున్న వైనానికి, ప్రస్తుతం దేశంలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలే ప్రత్యక్ష సాక్ష్యం. మతం పేర సామాన్య ప్రజల మధ్య విభేదాలు సృూఎష్టించి, విభజించి పాలించే బ్రిటిష్ రూల్‌ను కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నది. తెలుగు రాష్ట్రాల పాలకపార్టీలు ఈ ప్రమాదాన్ని గుర్తించకపోవడం చాలా బాధాకరం. ముఖ్యంగా టీఆర్‌ఎస్ విషయానికొస్తే, ఎన్నికల ముందు ఒకలా, తర్వాత మరోలా వ్యవహరిస్తున్నది. దేశానికి ప్రమాదకర శక్తులు బీజేపీ, కాంగ్రెస్‌లేనని చెప్పిన టీఆర్‌ఎస్ స్వరంలో మార్పు స్పష్టంగా వినిపిస్తున్నది. కేంద్రంలోని బీజేపీ సర్కార్ రాష్ట్రాల హక్కులు, అధికారాలను సైతం తనకు దఖలు పరుచుకునే ప్రయత్నంలో అనేక చట్టాలను ఏకపక్షంగా రద్దుచేసింది.

ప్రత్యేక ప్యాకేజీ కోరుతున్న తెలంగాణతోపాటు ప్రత్యేక హోదా ఆశిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు పార్లమెంటులో కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్న 370 ఆర్టికల్‌ను ఎత్తేయడానికి మోడీ సర్కారుకు తోడ్పడ్డాయి. తద్వారా తాము కూర్చున్న కొమ్మను తాము నరుక్కోవడమే అయ్యింది. ఇలా అనేక ప్రజా వ్యతిరేక బిల్లులు, రాష్ట్రాల హక్కులను హరించే చర్యలకు బీజేపీ ప్రభుత్వానికి పార్లమెంటులో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు రెండూ మద్దతునిచ్చాయి. ప్రధానంగా సమాచార హక్కు చట్టం కోరలు పీకేసీ, తాము ఆడిందే ఆటా పాడిందే పాటగా ప్రభుత్వాన్ని నడపాలని భావించారు మోడీ, షా ద్వయం. టీఆర్‌ఎస్, వైసీపీల మద్దతును కూడగట్టుకుని ప్రజావంచకంగా వ్యవహరించారు. ఆ బిల్లు సవరణతో ఆర్టీఐ కమిషనర్ల వ్యవహారాలకు సంబంధించిన అధికారాన్ని రాష్ట్రాలు కోల్పోయాయి. కమిషనర్ల జీతభత్యాలను నిర్ణయించడంతోపాటు, ఆ పోస్టుల పదవీకాలాన్ని ఎప్పుడంటే అప్పుడు కుదించే అధికారం, కమిషనర్లను యిష్టారాజ్యంగా తొలగించే, మార్చే అధికారాన్నీ కేంద్రం తన గుప్పిట్లో పెట్టుకుంది. రాజ్యసభలో సమాచార బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని కోరిన టీఆర్‌ఎస్, ఆ తర్వాత లోక్‌సభలో మాటమార్చి యూటర్న్ తీసుకుని బీజేపీకి ఓటేసింది. అంటకాగింది. తలొంచింది. ప్రశ్నించడం మానేసింది.

ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మయిన హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌ను రద్దు చేయడం ద్వారా టీఆర్‌ఎస్ నియంతృూఎత్వ పోకడలను తనంతట తాను బయటపెట్టుకుంది. దీనిపై ప్రజాఉద్యమాలు వెల్లువెత్తి ధర్నాచౌక్ తిరిగి తనగొంతును వినిపిస్తున్నది. తాజాగా టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు రాష్ట్ర రాజధానిలో జరిగిన ఒక సభలో మాట్లాడుతూ "ప్రశ్నించే హక్కు.. ప్రాథమిక లక్షణం" అని వ్యాఖ్యానించారు. మరో అడుగు ముందుకేసి "నాతో ఉంటే దేశభక్తుడు.. లేకుంటే దేశద్రోహి ముద్ర" అనే రీతిలో బీజేపీ నేతృూఎత్వంలోని ఎన్డీయే సర్కారు వ్యవహరిస్తున్నదని కూడా విమర్శించారు. మంచిదే. ఆశ్చర్యంగా కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ, ప్రజలకు ఊతమిస్తున్న ఆర్టీఐ చట్టం కోరలు పీకేందుకు ఓటేసిన అంశం యిక్కడ గమనార్హం. అయితే టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఈ విషయంలో ఒక్కమాటా మాట్లాడకపోవడం, హుటాహుటిన ప్రత్యేకవిమానంలో తన ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్‌ని ఢిల్లీకి పంపి అనుకూలంగా ఓటేయించడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ప్రజావ్యతిరేక చట్టాలు, బిల్లుల విషయంలో బీజేపీని పార్లమెంటులో ప్రశ్నించకుండా, పోరాడకుండా ప్రజాస్వామ్యాన్ని ఎలా కాపాడగలు గుతారు? రాష్ట్రాల హక్కులను ఎలా రక్షించగలుగుతారు? బీజేపీ తెచ్చిన ఆర్టీఐ చట్టంలోని నిబంధనలు ప్రజలకు, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏవిధంగా నష్టమో సవివరంగా చెబుతూ కేంద్ర సమాచార కమిషన్ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ తెలంగాణ, ఏపీ, ఒడిశా ముఖ్యమంత్రులకు స్వయంగా లేఖలు రాశారు. అయినా ఆయా రాష్ట్రాల సీఎంలకు చీమకుట్టినట్టయినా అనిపించలేదు సరికదా తమ అధికారాలను తామే కేంద్రానికి అప్పగించడంతోపాటు కాశ్మీర్ ప్రజలకు సమాచార హక్కు చట్టమే లేకుండా చేసిన చరిత్ర బీజేపీది, దానికి మద్దతిచ్చిన టీఆర్‌ఎస్, వైసీపీది కూడా. రాష్ట్రానికి ఆయా సమస్యల పరిష్కారం కోసం నిధులను రాబట్టడంతోపాటు నిజామాబాద్ ప్రజల చిరకాల కోరికయిన పసువుబోర్డు ఏర్పాటుకు కేంద్రాన్ని నిలదీయడంలో టీఆర్‌ఎస్ విఫలమైంది. దేశంలో మతసామరస్యాన్ని చెరబడుతూ, యావత్ కాశ్మీర్‌ను ఓపెన్ ఎయిర్ జైల్ చేసిన బీజేపీకి వత్తాసు పలకడం ద్వారా టీఆర్‌ఎస్ ద్వంద్వ విధానాన్ని పాటిస్తున్నది. ఈ సంగతిని ప్రశ్నించడంలో తెలంగాణ రాష్ట్రాధినేత మిన్నకుండి పోతున్నారు. బీజేపీ వికృూఎత చేష్టలను, చర్యలను ప్రశ్నించడంలో, అడ్డుకోవడంలో టీఆర్‌ఎస్ పాత్ర అంతంత మాత్రమే... పైపైన తిట్టడం, కీలకాంశాల్లో చేతులు కలపడం, కారు కిందకు నీళ్లు రావడం ఖాయమని రాజ కీయ విశ్లేషకులే సెలవిస్తున్న సంగతి పరిశీలనలో ఉండాలి సుమా..!

## ముంచుకొస్తున్న ప్రమాదం

రోడ్డు ప్రమాదాలను అరికట్టే పేరుతో మోడీ సర్కార్ ప్రజలను మరింత ఆగాధంలోకి నెట్టేయబోతున్నది. ఇటీవల ఆమోదించిన మోటారు వాహన చట్ట సవరణ(ఎమ్‌వీ యాక్టు) బిల్లు సెప్టెంబర్ నుంచి అమలులోకి రాబోతుంది. దీనివల్ల నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై భారీగానే వడ్డన పడుతుంది. ఈ బిల్లు కోసం నాలుగేండ్లుగా కాషాయ ప్రభుత్వం పడుతున్న తాపత్రయం వెనుక రహస్యం ఏమిటన్న సందేహాలే ఇప్పుడు పటాపంచలయ్యాయి. భద్రత, సౌలభ్యం అంటూ రవాణా వ్యవస్థల్లో ప్రయివేటు శక్తులు, వ్యక్తులకు లబ్ది చేకూర్చేందుకు వాహన చట్ట సవరణ బిల్లును తెచ్చింది. బిల్లులో పేర్కొన్న సవరణలపై చాలా రాష్ట్రాలు అభ్యంతరం తెలిపాయి. ఇది తమ హక్కులను కాలరాయడమేనని స్పష్టం చేశాయి. కార్మిక సంఘాలు కూడా బిల్లును తీవ్రంగా వ్యతిరేకించాయి. కార్మికుల ఉపాధిని దెబ్బతీసే రీతిలో ఈ బిల్లును ఒప్పుకోబోమని తెగేసి చెప్పాయి. అయినా, వారి మాటను వినేందుకు మోడీ సర్కార్ సిద్ధం కాకపోవడం గమనార్హం. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న విధానాలను, కార్పొరేట్లు, ప్రయివేటు సంస్థలకు రూట్లను అప్పగించడం వంటి వాటిని బిల్లులో నుంచి తొలగించేందుకు ససేమిరా అంటోంది. కేంద్రమంత్రి గడ్కరీ చెప్పినట్టు ఈ బిల్లుతో 2020 నాటికి ప్రమాదాలను సగానికి సగం తగ్గించడం మాట అటుంచి రవాణారంగాన్ని ప్రయివేటు చేతుల్లో కట్టబెట్టడం ఖాయం. లోక్‌సభలో పూర్తి మెజారిటీ, వివిధ పార్టీలను చీల్చి రాజ్యసభలో పెంచుకున్న బలంతో చాలా బిల్లులను మోడీ ప్రభుత్వం ఆమోదింపజేసుకుంది. ఎమ్‌వీ చట్ట సవరణ బిల్లు కూడా అందులో భాగమే.

మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చినకొత్తలోనే మోటారు వాహన చట్టం-2016ను లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. 2014లో రోడ్డు రవాణా, భద్రతా బిల్లు ఉండగా,, దానిపై వ్యతిరేకత రావడంతో పేరు మార్చి మోటారు వాహన చట్ట సవరణ బిల్లు-2016తో ముందుకొచ్చింది కేంద్రం. వాస్తవానికి 2014లోని బిల్లుకూ, 2016లోని బిల్లుకూ పెద్దగా తేడా లేదన్నది కార్మికసంఘాలు వాదిస్తూ వస్తున్నాయి. తర్వాత ఆయా రాష్ట్రాల సూచనలతో కొన్ని సెక్షన్లలో సవరణలు చేసినట్టు చెప్పినా బిల్లు కాపీని బహిర్గతం చేయలేదు. ఇటీవల ఉభయ సభల్లో ప్రవేశపెట్టిన సమయంలోనూ ముందస్తుగా బిల్లును సభ్యులకు అందించకపోవడం గమనార్హం. బిల్లులో ప్రధానంగా నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులపై భారీస్థాయిలో జరిమానాలు విధించడం, ప్రమాదానికి కారణమైన డ్రైవర్లపై చర్యలు తీసుకోవడం, జైలు పాలు చేయడం వంటి అంశాలు ఉన్నాయి. అదేవిధంగా బిజీగా ఉన్న రూట్లను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు అనుమతించడం, అటువంటి రూట్లల్లో ఆర్టీసీ బస్సులను అనుమతించకపోవడం, థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లను పెంచడం, వాహనాల విడిభాగాలు బ్రాండెడ్ వస్తువులే వాడటం, షావుల్లో స్థానిక ఉత్పత్తుల కొనుగోలుకు నిరాకరణ ఇలా ఎన్నో ప్రజా వ్యతిరేకమైన అంశాలను బిల్లులో కేంద్రప్రభుత్వం చేర్చింది. ఇవన్నీ ప్రజారవాణాను ధ్వంసం చేసేవే. దీనివల్ల ఆర్టీసీ మనుగడకు ప్రమాదం వాటిల్లనుంది. ఉదాహరణకు హైదరాబాద్ నుంచి విజయవాడ రూట్‌ను ప్రయివేటు వ్యక్తులు కొనుగోలు చేస్తే.. ఆ రూట్‌లో ఆర్‌టీసీ బస్సులు తిరగడానికి వీల్లేదు. ఇది లాభదాయకమైన రూట్లను ప్రయివేటుకు ఇచ్చేసి ఆర్‌టీసీని నిర్వీర్యం చేసే ప్రయత్నం తప్ప మరొకటి కాదు. ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యం కానున్నాయి. ప్రభుత్వఉద్యోగులకు భద్రత ఉండదు. సెక్షన్ 138ను సవరించడం ద్వారా సైకిల్, రిక్షా నడుపుతున్న వారి హక్కులు హరించబడతాయి. ఇప్పుడున్న అధికారాలతోనే పోలీసులు ముప్పతిప్పలు పెడుతున్నారు. కొత్త బిల్లుతో మరిన్ని చిక్కులు రావడం ఖాయం. చిన్నచిన్న షావులు పెట్టుకుని జీవనం సాగిస్తున్న లక్షలాది మంది భవితవ్యం రోడ్డున పడనుంది. అందుకే ఈ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తమవుతున్నది.

రోడ్డు భద్రత కోసమే ఈ బిల్లును తెచ్చామనీ దీనివల్ల ప్రమాదాలు తగ్గుతాయని కేంద్రమంత్రి గడ్కరీ చెబుతున్నారు. జరిమానాలు విధించడమే రోడ్డు భద్రతకు సరైన మార్గమని చూపడం దురదృూఎష్టకరం. ప్రమాదాలు జరగడానికి డ్రైవర్లనే బాధ్యులుగా చూపడం సరికాదు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో పాటు కాంట్రాక్టర్ల లోపాలున్నాయి. ముందుగా వాటిని సరిదిద్దాల్సిన అవసరం ఉంది. వాహనాలకు పర్మిట్‌లు, రిజిస్ట్రేషన్లు, లైసెన్సు ఇవ్వడం ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వాల పరిధిలో ఉన్నాయి. ఈ సవరణతో కేంద్రం పరిధిలోకి వెళ్లబోతున్నాయి. కేంద్రం ఏర్పాటు చేసే ఒక సంస్థ రిజిస్ట్రేషన్, లైసెన్సింగ్ రెండు ప్రక్రియలనూ ఔట్‌సోర్సింగ్ చేస్తుంది. అంటే రాష్ట్రాలకు ఉన్న హక్కులను కేంద్రం కాలరాయడమే. ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం. బిల్లు విషయంలో కేంద్రం చెబుతున్న దానికి చేస్తున్న పనులకు పొంతనలేదు. ఇలాంటి ప్రమాదకరమైన బిల్లును తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది. కోట్లాదిమంది.

# పంచాంగం ఆవిష్కరణ



నల్గొండ టౌన్, మేజర్‌న్యూస్ : శ్రీ భక్తాంజనేయ స్వామి సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీ క్రోధి నామ సంవత్సర సప్త వార్షికోత్సవ పంచాంగ ఆవిష్కరణ చేయబడింది. స్థానిక నల్గొండ జిల్లా కేంద్రంలోని ఆర్జాల బావి ఇందిరమ్మ కాలనీలో పంచాంగ ఆవిష్కరణ చేయబడింది. ఈ యొక్క కార్యక్రమము శ్రీ భక్తాంజనేయ సేవా సంస్థ ఫౌండర్ సిరి ప్రగడ శ్రీనివాస శర్మ వసంత అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోప బ్రాహ్మణ అఫీషియల్స్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్, తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగు నవీన్ శర్మ, శ్రీ భక్తాంజనేయ సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు పోచంపల్లి రమణ రావు, శ్రీ భక్తాంజనేయ సేవా సంస్థ ముఖ్య సలహాదారులు రుద్రాక్షి నరసింహ, అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకెళ్ళ శ్రీనివాస్, శ్రీ భక్తాంజనేయ స్వామి సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి గాదే కిరణ్ కుమార్, మాద సైదులు, సహాయ కార్యదర్శి ప్రచార కార్యదర్శి గాదె దామోదర్, పెన్నా జయప్రద, డాక్టర్ భరత్ కుమార్, ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ యువజన సంఘాల సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి మేడి హరికృష్ణ, తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి జిల్లా అధ్యక్షులు పసునూరి రాంబాబు, శ్రీ భక్తాంజనేయ సేవా సంస్థ కోశాధికారి సిరి ప్రగడ వసంత, ముఖ్య అతిథులు పోచంపల్లి రమణారావు, సిరి ప్రగడ శ్రీనివాస శర్మ, రుద్రాక్షి నరసింహ, జ్యోతి ప్రజ్వలన చేసి పంచాంగా ఆవిష్కరణ చేయడం జరిగింది. గౌరవ అధ్యక్షులు పోచంపల్లి రమణ రావు మాట్లాడుతూ పంచాంగం అనేది మంచి చెడులను చెప్పేది పంచాంగం కులాలకు మతాలకు రాజకీయాలకు అతీతంగా నిర్వర్తించే కార్యక్రమం పంచాంగా ఆవిష్కరణ ఈ యొక్క కార్యక్రమంలో శ్రీ భక్తాంజనేయ స్వామి సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన పట్టువస్త్రాలంకారణ ఉత్సవానికి హాజరైన గొంగిడి సునీత మహేందర్ రెడ్డి



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : వంగపల్లిలోని శ్రీ లక్ష్మీనర్సింహ్మా ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సోదరులు కానుగు రాజు గౌడ్ కుమార్తె సహస్ర, కుమారుడు ధార్విక్ నూతన పట్టువస్త్రాలంకారణ మహోత్సవ కార్యక్రమంలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, నాయకులతో కలసి పాల్గొన్న బి.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుదగాని హరిశంకర్ గౌడ్. ఈ కార్యక్రమంలో మూటకొండూర్ మండల బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు బొట్ల యాదగిరి, మాజీ సర్పంచ్‌లు చంద్రగాని జాహంగీర్, ఆరె మల్లేష్ గౌడ్, నాయకులు కానుగు అనిల్, బొట్ల ప్రశాంత్ తదితరలు పాల్గొన్నారు.

# మండల వ్యాప్తంగా 10497 అభయ హస్తం దరఖాస్తులు

నడిగూడెం, మేజెర్‌న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారంటీల అమలు కొరకు ప్రజాపాలనలో భాగంగా ఈ నెల 2నుండి 6వరకు దరఖాస్తుల స్వీకరించగా మండల వ్యాప్తంగా అభయ హస్తం దరఖాస్తులు 10497 వచ్చినట్లు తాసిల్దార్ హేమమాలిని తెలిపారు.స్వీకరించిన దరఖాస్తులను డాటా ఎంట్రీ చేయుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని ఈ నెల 17 వరకు డాటా ఎంట్రీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

# దేశానికి టార్చ్ బేరర్ లాంటి నాయకుడు అవసరం

## సదానందరెడ్డి



మర్రిగూడ మేజర్ న్యూస్ః దేశానికి టార్చ్ బేరర్ లాంటి నాయకుడు అవసరమని పీపుల్ ప్రొడక్షన్ పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి సదానంద రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మర్రిగూడ మండలంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ప్రజల చేత ప్రజల కోసం ఏర్పడ్డ ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కుకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు వాటిని నిర్వీర్యం చేస్తూ ఒక నియంతల కేంద్రంలో మోడీ పరిపాలిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగం కల్పించినటువంఇ హక్కులను ప్రభుత్వాలు భంగం చేస్తున్నాయని అన్నారు. పౌరులు సామాజికంగా రాజకీయంగా ఎదిగేందుకు ప్రభుత్వాలు పాలన చేయట్లేదని ఆయన మండిపడ్డారు. నరేంద్ర మోడి 10 సంవత్సరాల కాలంలో ప్రజా పాలనపై ప్రజలను ఉద్దేశించి ఏ ఒక్కరోజు ప్రెస్‌మీట్ పెట్టకపోవడం నియం పాలనకు నిదర్శనం కాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నీళ్లు, నిధులు, నియమకాలు కోసం ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల నడ్డి కేసీఆర్ విరగొట్టనట్లు సదానందరెడ్డి ఫైర్ అయ్యారు. లక్షల కోట్ల రూపాయల కుంభకోణం చేసి కల్వకుంట్ల ఫ్యామిలీ లక్షల కోట్లకు పడగెత్తిందని ఆయన ధ్వజమెత్తారు. ఉద్యమంతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిటిఫికేషన్లు లేక నిరుద్యోగులు రోడ్డున పడినట్లు ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కాములు, స్కీంలతో ప్రజల సొమ్మును దగా చేశారని ఆయన దుయ్యబట్టారు. పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ పేద ప్రజల రక్షణ కోసం నిలబడుతుందని ప్రశ్నించే యువత నేటి అవినీతి సమాజానికి చాల ముఖ్యమని ఆయన తెలిపారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన కల్వకుంట్ల ఫ్యామిలీకి పట్టిన గతే కేంద్ర ప్రభుత్వంలో మోడీకి జరుగుతుందని ఆయన జోస్యం చెప్పారు. పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ నుండి భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా తనను గెలిపిస్తే ప్రజలకు సరైన న్యాయం జరుగుతుందని ఓటర్లకు వివరించారు. ప్రజలకు, చదువుకున్న యువతరానికి, పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా సదానందరెడ్డి అన్నారు.

# కొండమల్లేపల్లిలో సినీ తార సందడి

## ఒకే కులం నిర్వహించిన కార్యక్రమం పట్ల ప్రజల్లో వెల్లువడిన నిరుత్సాహం

కొండమల్లేపల్లి మేజర్ న్యూస్ః కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని కన్యకా పరిమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో ఒక టీవీ ఛానల్ నిర్వహించే ఒక ప్రైవేట్ ప్రోగ్రాంలో సినీ తారలు ప్రత్యక్షమయ్యారు. ఆటా పాటలతో సందడిగా ఈ కార్యక్రమం ఉత్సాహంగా ముగిసింది. ఇక్కడే పట్టణ ప్రజల్లో నిరుత్సాహం ఏర్పడింది. ఒక పెద్ద ప్రైవేట్ టీవీ ప్రోగ్రాం మండల కేంద్రమైన ఇంత పెద్ద పట్టణంలో ఒక కులానికి చెందిన దేవాలయంలో అదే కులం వాళ్లు మాత్రమే పాల్గొనడం, ఇతర కులాల వారిని కులుపుకోకపోవడం ఒక రకమైన ఆలోచన పట్టణ ప్రజల్లో నెలకొంది. అందర్నీ కలుపుకుపోయి కలివిడిగా ఎంతో కోలాహాలంగా జరిగే కార్యక్రమం ఒకే కులానికి మాత్రమే అంకితం కావడం పట్ల పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేయడం జరిగింది. నాగరికత ఎంతగా అభివృద్ధి చెందినా ఈ రకమైన ధోరణి సరి కాదని, ఈ కార్యక్రమంలో అన్ని కులాల వారినీ భాగస్వామ్యం చేయడం అవసరమని, కులాంతర మతాంతర రహిత సమాజం కోసం పరితపిస్తున్న ఈ కాలంలో ఇలా ఒకే కులానికి సంబంధించిన వ్యక్తులు మాత్రమే పాల్గొనడం పట్ల కొంతమంతి ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేయడం జరిగింది.



# ఘనంగా సర్దార్ పాపన్న గౌడ్ మహారాజ్ 314వ వర్ధంతి



తుర్కపల్లి మేజర్ న్యూస్ః తుర్కపల్లి మండల కేంద్రంలోని చౌరస్తాలో బహుజన విప్లవ వీరుడు శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 314 వర్ధంతి కార్యక్రమాన్ని కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొక్కొండ లింగయ్య గౌడ్, గౌడ సంఘం జిల్లా నాయకులు ఎరుకల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ సర్దార్ పాపన్న గౌడ్ మహారాజ్ బహుజనులను ఏకం చేసి గోల్కొండ కోటతో పాటు మరో 32 కోటలను జయించిన బహుజన విప్లవ వీరుడని బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందించిన ధీరుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి టౌన్ ప్రెసిడెంట్ కొక్కొండ నర్సింలు గౌడ్, దొంకేన కిష్టయ్య గౌడ్, కొక్కొండ లక్ష్మీ నారాయణ గౌడ్, పాముల కిష్టయ్య గౌడ్, పాముల నర్సింలు గౌడ్, పాముల రాజు గౌడ్, పల్లె నరేష్ గౌడ్,కూరెళ్ల రాజాలు గౌడ్, తాటికొండ నాగరాజు గౌడ్, కట్కూరి గణేష్, దొంకెన వంశీ గౌడ్, కొక్కొండ పోచయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా న్యాయవాది ప్రదీప్తికి సన్మానం



నేరుడుచర్ల మేజర్ న్యూస్ః నేరేడుచర్ల పట్టణానికి చెందిన ప్రముఖ మహిళా న్యాయవాది సుంకర ప్రదీప్తిని కాకతీయ కమ్మ సంఘం ఆదివారం ఘనంగా సన్మానించింది. ప్రదీప్తి ఇటీవల హుజూర్‌నగర్ న్యాయవాదుల సంఘం సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాది ప్రదీప్తి, క్రాంతి కుమార్ దంపతులను పట్టు శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం ప్రతినిధులు రావులపల్లి ప్రసాద్, నిమ్మగడ్డ సుబ్బారావు, యారవ సురేష్, అల్లు నాగభూషణం, చెరుకూరి తిరుపతమ్మ, నిమ్మగడ్డ అన్నపూర్ణ, వేమూరి నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవలో శైలజ చేసిన సేవలు మరువలేనివి

## నల్లగొండ జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి

నల్గొండ అర్బన్ మేజర్ న్యూస్ః ప్రజా సేవలో శైలజ చేసిన సేవలు మరువలేనివని నల్లగొండ జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక రత్న ఫంక్షన్ హాల్‌లో నారాయణపేట జిల్లా పరిషత్ సీఈవోగా పదవీ విర మణ పొందిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో వివిధ హోదాలలో శైలజ చేసిన సేవలు ఎనలేనివని అన్నారు. ఈ సందర్భంగా శైలజ, లింగయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు, యాదాద్రి అడిషనల్ డిఆర్‌డిఓ సురేష్, నల్లగొండ డిఆర్‌డిఓ నాగిరెడ్డి, మేడ్చల్ డిసిఓ శ్రీనివాసమూర్తి, జిల్లా డిజిటల్ అధికారుల సంఘం కార్యదర్శి, భూమి కొలతల శాఖ ఏడి శ్రీనివాస్, రిటైర్డ్ డిప్యూటీ సీఈవో మోహన్ రావు, యాదాద్రి సిపిఓ గూడా వెంకటేశ్వర్లు, పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు జి వెంకట్ రెడ్డి, జెల్ల శ్రీశైలం, రావిరాల నరసయ్య, పున్న అంజయ్య తదితరులు పాల్గొన్నారు.